మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 63 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada






## బుద్ధుని భోదనలు భారతావణికి అవసరం

- నేటి సమాజంలో అసహనం పెరుగుతుంది
- బుద్ధుని సందేశాన్ని ప్రతి ఒక్కరికీ చెరవేసేలా కృషి
- బుద్ధపూర్ణిమ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- ధ్యాన మందిరం కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** తెలంగాణలో బౌద్ధ బిక్షులకు తగిన గౌరవం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజ్యం, అధికారం ఉండి వాటిని కాదని 29 ఏళ్ల వయసులో శాంతి కోసం బుద్ధుడు ఆలోచించారన్నారు. రెండున్నర వేల సంవత్సరాలుగా బౌద్ధ సిద్ధాంతం నిలబడి ఉందని ఉద్ఘాటించారు. సికింద్రాబాద్‌లోని మహేంద్ర హిల్స్‌లో గురువారం మహబోధి బుద్ధవిహార్‌లో జరిగిన బుద్ధపూర్ణిమ వేడుకల్లో ముఖ్యఅతిథిగా రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గొప్ప క్షేత్రాన్ని సందర్శించిన అనుభూతి కలిగిందని తెలిపారు. ప్రతి పనిని ధ్యానంగా చేయాలన్న సూచనలో చాలా అర్థం ఉందని ఈ సూక్తిలో నుంచి ఎంతో స్ఫూర్తిని పొందారని చెప్పారు. ఏ పని అయినా తాను ఎంతో ధ్యానంగా చేస్తానని స్పష్టం చేశారు. ధ్యాన మందిరం కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఒక పాఠశాలను నిర్వహించాలని తాను కోరుతున్నానని చెప్పారు. సమాజంలో అసహనం, అసూయ పెరిగిపోతున్నాయన్నారు.సమాజంలో స్పర్థలు, ఉద్వేగాలు పెరిగేలా వాతావరణం నెలకొని ఉందన్నారు. బుద్ధుని సందేశం దేశానికి ఇప్పుడు ఎంతో అవసరమన్నారు. బుద్ధుడి సందేశాన్ని సమాజంలో ప్రతి ఒక్కరికి చేరవేయడానికి అవసరమైన సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం మీది... అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.



# ఛత్తీస్‌ఘడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

**ఏడుగురు మవోయిస్టులు మృతి**
**భారీగా ఆయుధాలు స్వాధీనం**

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి కాల్పులతో దద్దరిల్లాయి. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లా, నారాయణపూర్ జిల్లా సరిహద్ద ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సలైట్లు మరణించారు. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంద్రావతి ఏరియా కమిటీ, నారాయణపూర్, దంతెవాడ, బస్తర్ జిల్లాలకు చెందిన డీఆర్జీ, బస్తర్ ్ర÷టైర్స్‌తో పాటు ఎస్టీఎఫ్ బృందాలపై కాల్పులు జరగడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. ఇప్పటికే ఏడుగురు నక్సల్స్ మరణించగా, 12 మంది నక్సలైట్లు గాయపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉంది. నారాయణపూర్ బీజాపూర్ జిల్లా సరిహద్దుల్లో ఎ÷-లాటూన్ నంబర్ 16, ఇంద్రావతి ఏరియా కమిటీకి చెందిన నక్సలైట్లు సంచరిస్తున్నారనే సమాచారంతో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ సమయంలోనే ఇరు వర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 100కు పైగా నక్సలైట్లు ఎన్‌కౌంటర్లలో మరణించారు. రెండు వారాల క్రితం బీజాపూర్ పిడియా గ్రామ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మరణించారు. అంతకుముందు ఏప్రిల్ 16న కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 29 మంది నక్సలైట్లు మరణించారు.

## రేవంత్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో వెళ్తోంది..


- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు తుస్
- మహిళలకు బస్సు ప్రయాణం కూడా అనుమానమే
- ఉద్యోగుల నాలుగు డిఏలపై మాట్లాడడం లేదు
- ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపిస్తే మండలిలో కొట్లాడుతాం
- హన్మకొండ సన్నాహక సభలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



**హనుమకొండ,మే 23 (ప్రజా మంటలు):** కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఒకే ఒక హామీ మాత్రమే అమలైందని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ కూడా తుస్సేనని ఎద్దేవా చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా హన్మకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన పట్ట భద్రుల ఉప ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు నాలుగు డీఏలు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసింది. అందుకోసం అసెంబ్లీ, కౌన్సిల్‌లో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా కలిసి


మిగతా 2లో..


## బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం



**25న తుఫానుగా మారే అవకాశాలు**
**అండమాన్ దీవులకు విస్తరించిన నైరుతి**
**వాతావరణ శాఖ వెల్లడి**

**హైదరాబాద్, (ప్రజా మంటలు):** పశ్చిమ మధ్య, దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని, శనివారం నాటికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం వాతావరణశాఖ తెలిపింది. ఈ నెల 25న తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా మారే అవకాశాలు ఉన్నాయని.. 26 నాటికి పశ్చిమ బెంగాల్ తీరానికి తుఫాను చేరుతుందని పేర్కొంది. బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు విస్తరించాయి.ఈ క్రమంలో తెలంగాణలో రాగల రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, హన్మకొండ, జనగామ, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయని పేర్కొంది. ఇక శనివారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఉండే అవకాశం ఉందని పేర్కొంది.




# 400 సీట్లు పగటి కలలు

**తడిగొంతు ఆరిపోవడం ఖాయం**
**నీళ్ళు దగ్గర పెట్టుకొండి : ప్రశాంత్ కిషోర్**

**న్యూఢిల్లీ, మే 23 (ప్రజా మంటలు):** 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దాదాపు 300 సీట్లు సాధిస్తుందని జోస్యం చెప్పారు ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్. భారతీయ జనతా పార్టీకి 2019లో వచ్చినట్లుగానే ఈసారి కూడా మెరుగైన స్థానాలు కైవసం చేసుకుంటుందని.. గతంలో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులకు ఒక సూచన చేశారు ప్రశాంత్ కిషోర్. జూన్ 4 ఓట్ల లెక్కింపు రోజు న హైడ్రేటెడ్‌గా ఉండండి అని సూచించారు. అలాగే బీజేపీ రాదని భ్రమలో ఉన్న వాళ్లు గొంతు తడుపుకో వడానికి నీటిని పుష్కలంగా అందుబాటులో ఉంచుకోండి అని సందేశాన్ని తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.ఇటీవలి ఇంటర్వ్యూలో తన అంచనాలు తారుమారు అయ్యాయని జర్నలిస్ట్ గుర్తు చేసిన సందర్భంగా వాడి వేడిగా మాటలు సాగాయి. అలా జరిగిన కొద్దిసేపటికే ప్రశాంత్ కిషోర్ ఈ ట్వీట్ చేయడం రాజకీయంగా ఆసక్తిగామారింది. 47 ఏళ్ల వయసుగల్గిన రాజకీయ వ్యూహకర్త 2022లో హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ రాబోయే ఎన్నికల పరాజయంతో సహా గతంలో తన రెండు పోల్ అంచనాలు తారుమారు అయ్యాయని ఆ ఇంటర్వ్యూలో గుర్తు చేశారు సీనియర్ జర్నలిస్ట్. దానికి కౌంటర్ గా ప్రశాంత్ కిషోర్ 2021లో బెంగాల్ ఎన్నికల్లో కిషోర్ తృణమూల్ కాంగ్రెస్ కు వ్యూహకర్తగా పనిచేశారు. మమతా బెనర్జీ టీఎంసీ పార్టీ 294 స్థానాలకు గాను 215 స్థానాలను గెలుచుకుని అఖండ మెజారిటీతో అధికారాన్ని నిలుపుకుందని ఈ సందర్భం గా మరోసారి గుర్తుచేశారు. అలాగే ఇప్పుడు తాను చెప్పే ప్రిడిక్షన్ కూడా నిజమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.అందుకే ప్రతి ఒక్కరూ నీటిని అందుబాటులో ఉంచుకోండి అని రాజకీయ నాయకులకు చురకలు అంటించారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల అవ్వగానే మనసు, శరీరం రెండింటినీ హైడ్రేటెడ్‌గా ఉంచడంలో నీరు దోహదపడుతుంది అని గుర్తు చేశారు. బుధవారం ఓ ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ బీజేపీకి సొంతంగా 370 సీట్లు రావడం అసాధ్యమని, ఆ పార్టీకి దాదాపు 300 సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. ఎన్డీఏ 400 మార్కును


మిగతా 2లో..


## ప్రజా నాడి




## రాష్ట్ర వ్యాప్తంగా సజావుగా ధాన్యం కొనుగోళ్లు


**చిన్నిచిన్న పొరపాట్లను పెద్దవిగా చూడరాదు**
**7,172 సెంటర్లలో 39.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**
**పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్**



**హైదరాబాద్, (ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగుతున్నాయని పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు. అయితే పెద్ద సంఖ్యలో కొనుగోళ్లు జరిగినప్పుడు చిన్న చిన్న లోపాలు జరగడం సహజమని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై చౌహాన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావొస్తోందన్నారు. ధాన్యం కొన్న తర్వాత రైతులకు డబ్బులు పడ్డాయా లేదా అనేది ప్రతీ సెంటర్ నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. 7,172 సెంటర్‌లలో 39.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. తెలంగాణ బియ్యానికి మంచి బ్రాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ధాన్యం తరుగు అనేది అవాస్తవం.. కొనుగోలు కేంద్రాల వద్ద క్లీనింగ్ మిషన్లు పెట్టాము. క్లీనింగ్ ఉన్న ధాన్యంలో ఒక్క కిలో కూడా కటింగ్ లేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యం క్లీన్‌గా ఉండాలని ఆదేశాలు ఉన్నాయి. ధాన్యంలో మట్టి, చిన్న రాళ్ళు, డస్ట్ ఉంటే సమస్య వస్తుంది. బకాయిలు ఉన్న మిల్లర్లకు ధాన్యం ఇవ్వలేదు. కొంతమంది మిల్లర్ల వద్ద కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. అందుకే వాళ్లకు ధాన్యం ఇవ్వలేదు. నీతినిజాయితీగా పని చేస్తున్నాం. మిల్లర్ల వద్ద డబ్బులు అధికారులు డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు చేయడం సరికాదు. ఆధారాలుంటే నిరూపించాలన్నారు. మాపై అసత్య ఆరోపణలు చేయడం వల్ల మాకే కాదు రైతులకు కూడా ఇబ్బంది అవుతుంది. ఆధారాలు లేని అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని చౌహాన్ హెచ్చరించారు.

## మహరాష్ట్ర రసాయన పరిశ్రమలో ఘోరప్రమాదం

**ఎనిమిది మృతి.. 60 మందికి గాయాలు**



**ముంబై, మే 23 (ప్రజా మంటలు):** మహారాష్ట్రలోని థానేలో ఓ రసాయన పరిశ్రమలో గురువారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, 60 మందికిపైగా గాయాలపాలయ్యారు. దోంబివిలి ఎంఐడీసీ ఫేజ్-2 ప్రాంతంలోని అముదాన్ కెమికల్ కంపెనీలో గురువారం మధ్యాహ్నం రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు వెల్లడించారు.ఫ్యాక్టరీలో మూడు పేలుళ్లు వినిపించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కనీసం ఎనిమిది మందిని రక్షించినట్లు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఇతర అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. దొంబివిలి ఎంఐడీసీలోని అముదన్ కెమికల్ కంపెనీలో బాయిలర్ పేలిన ఘటన బాధాకరమని ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. ఈ ఘటనలో 8 మందిని రక్షించారని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇక పేలుడు ధాటికి ఘటనాస్థలిలో పెద్ద బిలం ఏర్పడింది. పేలుడు కారణం గాజు కిటికీలు దెబ్బతిన్నాయి. బాయిలర్ పేలుడు కారణంగా ఉత్పత్తి చేయబడిన వేడి భారీ ఇనుప కిరణాలు వంగిపోయేలా చేసింది. పక్కనే ఉన్న ఫ్యాక్టరీల పైకప్పులు ఎగిరిపోయి భారీ నష్టం వాటిల్లింది. పేలుడు శబ్ధం కిలోమీటరు దూరం నుంచి వినిపించింది. ఈ పరిశ్రమలో కొందరు చిక్కుకున్నారని, వారి కోసం రెస్క్యూ సిబ్బంది గాలింపు చేపట్టారు. డ్రోన్లను ఉపయోగిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

## రేవంత్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో వెళ్తోంది..

పోరాడతాం. అందుకు ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపించాలని అన్నారు. నారాయణఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీఛార్జి చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. నిరుద్యోగ భృతి హామీపై నిలదీస్తే.. అలా చెప్పలేదని అసెంబ్లీలో భట్టి విక్రమార్క అంటున్నారు. కరెంటు బిల్లులు, భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడానికి సిద్ధమవుతున్నారు. ఒక వైపు సంక్షేమానికి కోతలు.. మరో వైపు వాతలా? అన్ని వర్గాలను మోసం చేయడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయింది. అందుకే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబితే కాంగ్రెస్ దారికొస్తుందని హరీశ్‌రావు అన్నారు. పట్ట భద్రుల సీట్ బీఆర్ఎస్ సొంతం చేసుకుంటుందని హరీష్ రావు అన్నారు. రాకేష్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలి. ఎమ్మెల్యే స్థానంలో ఎమ్మెల్సీ గెలిపించాలి. కాంగ్రెస్ పాలనలోఉచిత బస్సు పథకం తప్ప అన్నీ తుస్. ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది. రైతాంగాన్ని నిలువునా మోసం చేసింది. ఇందిరమ్మ ఇల్లు, పింఛన్, అమలు చేసుడు విస్మరించింది. విద్యార్థి, నిరుద్యోగుల, ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ కు ఓటు తో బుద్ధి చెప్పాలి. ఉపాధ్యాయులపై నారాయణ ఖేడ్ లో లాఠీ ఛార్జి చేయడం సిగ్గు చేటు. వడ్లకు బోనస్ ఎగ్గొట్టిన కాంగ్రెస్ రైతు బిడ్డలు బుద్ధి చెప్పండి. సంక్షేమ పథకాలలో కోతలు, ధరలు పెంచి వాత పెడుతున్న రేవంత్ కు విద్యా వంతులు బుద్ధి చెప్పాలని ఆయన వ్యాఖ్యానించారు. తీన్మార్ మల్లన్న గొంతు ఎందుకు మూగబోయింది. ప్రశ్నించే గొంతు రాకేష్ రెడ్డికి పట్టభద్రులు ఓటు వేయాలి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచిన బీజేపీ కి వాత పెట్టాలి. తెలంగాణ వాణి వినిపించాలంటే బీఆర్ఎస్ ను బలపర్చాలి. తెలంగాణ ఉద్యమ కార్లపై తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ కు పట్ట భద్రులు ఓటు వేయొద్దు. హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని కుట్రలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వంకు గుణపాఠం చెప్పాలని అన్నారు. తెలంగాణ నీళ్లు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలించాలని బీజేపీ కుట్రలకు కాంగ్రెస్ వత్తాసు పలుకుతోంది. 2వేల పడకల ఆసుపత్రి చివరి దశకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలంగాణ చిహ్నం ను తొలగించాలని కుట్రలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో పంటలు కోనేటోళ్ళు లేరు, కరెంట్ సరఫరాలో విఫలమయ్యారు. కాంగ్రెస్ అబద్దాలు, మోసాలను ప్రశ్నించడం రాకేష్ రెడ్డికి సాధ్యమని హరీష్ రావు పేర్కొన్నారు.

### 400 సీట్లు పగటి కలలు

అధిగమిస్తుందని బీజేపీ ప్రకటించిన రోజునే.. ఇది సాధ్యం కాదని తాను చెప్పినట్లు వివరించారు. అయితే ఆ పార్టీ 270 మార్కుకు దిగువన పడిపోదని తాను నమ్ముతున్నానన్నారు.

## ప్రజ్వల్..వెంటనే పోలీసులకు లొంగిపో..

### న్యాయ ప్రక్రియను ఎదుర్కోవాల్సిందే

### ఇది నా అర్డర్..మనవడు ప్రజ్వల్‌కు దేవేగౌడ హెచ్చరిక



బెంగళూరు,మే 23 (ప్రజా మంటలు):
రాసలీల వీడియోల్లో అడ్డంగా దొరికిపోయిన తన మనవడు, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వెంటనే భారత్ తిరిగి వచ్చి.. పోలీసులకు లొంగిపోవాలని అతడి తాత, మాజీ ప్రధాని దేవగౌడ సూచించారు. లేకుంటే తన ఆగ్రహాన్ని చవి చూడాల్సి ఉంటుందని ప్రజ్వల్‌ను ఆయన హెచ్చరించారు. మై వార్నింగ్ టు ప్రజ్వల్ రేవణ్ణ పేరుతో గురువారం ఎక్స్ వేదికగా తాను రాసిన లేఖను దేవగౌడ పోస్ట్ చేశారు. నీవు నా సహనాన్ని పరీక్షించవద్దు. ఎక్కడ ఉన్నా తిరిగి రావాలి. న్యాయ పక్రియను ఎదుర్కోవలసి ఉందని ప్రజ్వల్‌కు ఈ సందర్భంగా దేవగౌడ సూచించారు. అయితే ఈ లేఖ ద్వారా ప్రజ్వల్‌ను తాను అభ్యర్థించడం లేదని.. హెచ్చరిస్తున్నానని దేవగౌడ స్పష్టం చేశారు. ఈ విషయంలో తనతోపాటు తన కుటుంబ సభ్యుల ఆగ్రహాన్ని సైతం ప్రజ్వల్ ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. తనపై అతడికి ఏ మాత్రం గౌరవం ఉన్నా వెంటనే తిరిగి రావాలని ఆకాంక్షించారు. గత కొన్ని వారాలుగా తన పట్ల, తన కుటుంబ సభ్యుల పట్ల ప్రజలు చాలా ఆగ్రహంతో తీవ్ర ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కానీ వారిని ఆ ఆరోపణలు చేయవద్దని వారించనని చెప్పారు. అలాగే వారితో వాదనలకు దిగే ప్రయత్నం కూడా
చేయనని తెలిపారు. కానీ ప్రజ్వల్ వ్యవహారంలో నిజాలు వెలుగులోకి వచ్చే వరకు తాను వేచి చూస్తానని దేవగౌడ అన్నారు. అదే విధంగా ప్రజ్వల్ చేసిన పనులు తనకు తెలియదంటూ ప్రజలను బుజ్జగించే ప్రయత్నం సైతం తాను చేయనని స్పష్టం చేశారు. ప్రజ్వల్ విదేశీ ప్రయాణం సంగతి కూడా తనకు తెలియదని ఈ సందర్భంగా దేవగౌడ తెలిపారు. కానీ తన మనసాక్షికి జవాబు చెప్పుకోవాల్సి ఉందన్నారు. ఆ దేవుడినే నమ్ముతానని.. వాస్తవమేమిటన్నది ఆ దేవుడికే తెలియాలని దేవగౌడ చెప్పారు. సార్వత్రిక ఎన్నికల వేళ.. జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీల వీడియోలు వేలాదిగా బహిర్గతమయ్యాయి. అయితే అవి బహిర్గమైన వెంటనే.. ప్రజ్వల్ జర్మనీ వెళ్లిపోయారు. దీంతో ఎన్నికల వేళ.. ప్రజ్వల్ వ్యవహారం ప్రతిపక్షాలకు అస్త్రంగా మారాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ కలిసి కర్ణాటకలో పోటీ చేస్తున్నాయి. ఆ క్రమంలో ఆ రెండు పార్టీలను లక్ష్యంగా చేసుకుని ఇండియా కూటమిలోని పార్టీలు విమర్శనాస్త్రాలు సంధించాయి. ఇక ప్రజ్వల్ రేవణ్ణను భారత్‌కు తీసుకు వచ్చేందుకు కేంద్రం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

## ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ సందర్శన

సూర్యాపేట ప్రతినిధి (ప్రజా మంటలు):
వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజు విధులు నిర్వ హించే గ్రాడ్యుయేట్ ఉద్యోగులు కోసం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎస్.వెంకట్రావు అదనపు కలెక్టర్ సిహెచ్.ప్రియాంకతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఈ నెల 22, 23వ తేదీలలో 182 మంది పోలింగ్ రోజు విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి నేడు చివరి రోజు కాబట్టి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కలెక్టరేట్ లోని ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ పట్టభద్రుల ఓటు హక్కుని వినియోగించు కోవచ్చని తెలిపారు.



# డబుల్ డిజిట్ సీట్లలో బీజేపీ విజయం

### పట్టభద్రుల ఎన్నికలలో ప్రేమేందర్ రెడ్డి ని గెలిపించాలి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




ఖమ్మం మె 23 (ప్రజా మంటలు):
వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం నగరంలోని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియా సమావేశం లో మాట్లాడిన ముఖ్యాంశాలు లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లలో బీజేపీ విజయం సాధిస్తుంది.కేంద్రంలో మరో నరేంద్రమోదీ ప్రధాని కావాలని తెలంగాణ ప్రజలు కోరుకున్నారు..పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘణనీయంగా బలపడింది.ఈ సారి బీజేపికి ఓటింగ్ శాతం పెరిగింది.వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఉప ఎన్నికలు ఈ నెల 27 ఉన్నాయి.ప్రజాక్షేత్రంలో.. ప్రజా ఉద్యమంలో.. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ముందున్న గుజ్జుల ప్రేమేందర్ మళ్లీ ఉప ఎన్నికల్లో బరిలో ఉన్నారు పార్లమెంట్ ఎన్నికల్లో సానుకులంగా ఉన్నట్లే.. పట్టభద్రుల ఎన్నికల్లో కూడా విద్యావంతులు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.పార్టీ పరంగా, అభ్యర్థి పరంగా చూసిన గుజ్జులకు ప్రజల అండదండలు ఉన్నాయిగతంలో బీఆర్ఎస్ శాసన మండలిని నిర్వీర్యంచేసింది. దానికి ప్రధాన్యత లేకుండా చేసింది.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలందరిని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుంది. ప్రతిపక్షమే లేకుండా చేసింది.ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీ.. వరుసగా కాంగ్రెస్?లో చేరుతున్నారు.. బీఆర్ఎస్ నుంచి గెలిచినా.. కాంగ్రెస్? నుంచి గెలిచినా రెండు పార్టీలు ఒక్కటే.. బీఆర్ఎస్?నుంచి గెలిచిన వ్యక్తి ఆ పార్టీకి.. ఆ పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్? పార్టీ గుర్తుపై సికింద్రాబాద్?లో పోటీ చేశారు. దేశంలో ఇలాంటి ఘటన ఎక్కడ లేదు.. వరంగల్ లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత, బీ ఫాం తీసుకున్నాక కూడా ఆమె కాంగ్రెస్? పార్టీ గుర్తుపై పోటీచేశారు. ఈ రెండు పార్టీలకు నైతిక విలువలు లేవు. రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారు.ఈ రోజు మనకు మళ్లీ అవకాశం వచ్చింది.. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి ఉప ఎన్నికలు జరగబోతున్నాయి.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచిన ఆయన పాలక పక్షమే.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిచినా ఆయన కాంగ్రెస్?లో చేరడమే సంప్రదాయంగా వస్తుంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్?లో చేరుతారని మంత్రులు చెబుతున్నారు. విద్యావంతులు, మేధావులు ఆలోచించింది. ప్రజల పక్షాన పోరాడేందుకు అవకాశం ఉన్న బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి. శాసన మండలిలో ప్రజా సమస్యలు.. ఉద్యోగుల సమస్యలు.. నిరుద్యోగులకు సమస్యలు గురించి గొంతు వినిపించాలంటేబీజేపీ అభ్యర్థిని గెలిపించాలి. పదేళ్లుగా తెలంగాణ లో కుటుంబ పాలన నడిచింది. కుటుంబ పాలన పోవాలి. నియంత పాలన పోవాలనే ఆలోచనతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దుతు ఇచ్చారు. ఇప్పుడు వారి పరిస్థితి పెంకనుంచి పోయిలో పడ్డ చందగా మారింది. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు అనేక రకాల హామీలు ఇచ్చారు. ఆరు గ్యారంటీ హామీలు ఇచ్చింది.డిసెంబర్ 9న సోనియగాంధీ జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్ ఋణమాఫీ చేస్తామన్నారు. ఇప్పుడు ఆగస్టు 15 వరకు చేస్తామంటున్నారు. మాట ఎందుకు మార్చారు.ఇప్పుడు వర్షాకాలం మొదలుకానుంది.. రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులు పాత ఋణాలు కట్టొద్దన్నారు. ఇప్పుడు ఋణమాఫీ చేయాలేదు.. వారికి ఇప్పుడు పంట పెట్టుబడి తీసుకునే అవకాశం లేదు.ధాన్యానికి క్వింటల్?కు రూ.500బోనస్ ఇస్తామన్నారు. వ్యవసాయ రంగాన్నికి ప్రభుత్వం ఏమీ లేయలేదు. 45రోజులుగా కల్లాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు.వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం మొలకెత్తుతుంది.అయినా ప్రభుత్వం స్పందించడం లేదు.దొడ్డు బియ్యాన్ని ఎఫ్ సీఐ నుంచి కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.పత్రి గింజకు కేంద్ర ప్రభుత్వ డబ్బులు చెల్లిస్తుంది. కొనుగోళ్లకు సంబంధించిన ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది.వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలుచేస్తామన్నారు.. సోనియాగాంధే స్వయంగా సంతకం పెట్టిన పత్రాలను ఇంటింటి పంపారు.ఇప్పటి వరకు ఎందుకు హామీలను అమలు చేయలేదు. నిరుధ్యోగులకు భృతి చెల్లిస్తామన్నారు.. ఏమైంది మహిళలకు రూ.2500 ఎప్పటి నుంచి వేస్తారు.విద్యార్థులకు రూ.5లక్షల కార్డు ఇస్తామన్నారు. ఏమైందిబీఆర్ఎస్ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదు..బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేపోమాపో చేరబోతున్నట్లు మంత్రులు మాట్లాడుతున్న కేసీఆర్, కేటీఆర్స్పందించడం లేదు.విద్యవంతులు, మేధావులు ఆలోచించి ఈ ఎన్నికల్లో ఓటు వేయాలి.ప్రత్యమ్నాయ శక్తిగా, ప్రశ్నించే గొంతుకగా బీజేపీ ఉంటుంది.ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రధాన్యత ఓటు వేసి గెలిపించాలి.

## పట్టభద్రుల ఉప ఎన్నికల్లో గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించండి

**దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత నరేంద్ర మోదికి చెందుతుంది**

**బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్**

**బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



దేవరకొండ మే 23 (ప్రజా మంటలు): ఈనెల 27వ తేదీ జరిగే పట్టభద్రుల ఉప ఎన్నికల్లో విద్యావంతుడు, నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకై బిజెపి పార్టీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు పనిచేయాలని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్, బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం దేవరకొండ పట్టణంలోని పి పి ఆర్ ఫంక్షన్ హాల్ లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం అసెంబ్లీ కన్వీనర్ ఎటి కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజల అభివృద్ధి కొరకు నిజాయితీ గల పరిపాలనకుడిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పని చేస్తున్నారని, దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత నరేంద్ర మోడీకి చెందుతుంది అని అన్నారు.నీతి నిజాయితీకి ధర్మరక్ష పరిరక్షణకు అనుగుణంగా పనిచేస్తున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.నరేంద్ర మోడీ ఎలాంటి అవినీతి లేకుండా నిరుద్యోగులకు, ఉద్యోగులకు బాసటగా నిలుస్తూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ప్రశ్నించే గొంతుకను శాసనమండలిలో నిలపడం కోసం దేవరకొండ నియోజకవర్గం పట్టబద్రులంతా ఒకటో నెంబర్ పై ఉండే గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేంద్ర మోడీకి మద్దతు పలకాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నల్లగొండ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి పెద్దపల్లి ఎంపీ నేతకాని వెంకటేష్,బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి మనోహర్ రెడ్డి,పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి,సుభాష్ చంద్ర జీ,కొప్పు భాష,కేతావత్ లాలు నాయక్,కర్నాటి సురేష్,అంకురి నరసింహ, మల్లేష్ నాయక్,చేనమోని రాములు,వానం నరేందర్ రెడ్డి, వసుకుల సుధాకర్,నక్క వెంకటేష్, నేతల వెంకటేష్, రవి నాయక్ అన్ని మండలాల అధ్యక్షులు దేవరకొండ నియోజకవర్గం లో ఉన్న ప్రజాప్రతినిధులు నియోజకవర్గంలో గల పట్టబద్రులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది తదనంతరం మున్సిఫ్ కోర్టు దేవరకొండలో మరియు కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

## అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

### జిల్లా ఎస్పి చందనా దీప్తి



నల్గొండ మే 23 (ప్రజా మంటలు): అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పి ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొ న్నారు. ఇసుక రీచ్ల నుంచి ఇసుక తెచ్చే వారు అనుమతి పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కొంత మంది దళారులు,మధ్యవర్తులు ఎక్కువ సిమ్ కార్డులు కొని ఇసుకను ఆన్లైన్లో బుక్ చేసుకుని అత్యవసరమైన వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుకను ఆన్ లైన్ లో ఎవరి పేరు మీద బుక్ చేసుకుంటే అక్కడే సరఫరా చేయాలి అన్నారు. ఇసుక ట్రాక్టర్లను అనవసరంగా రోడ్ల పైన ఆపడం వల్ల అనేక ప్రమాదాల జరుగుతున్నాయని అలాంటి వారిపై ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం కేసులు నమోదు చేయబడుతాయని అన్నారు.

# రేవ్‌పార్టీ దుమారం

### తెలుగు నటికి బ్లడ్ శాంపిల్స్‌లో డ్రగ్ పాజిటివ్


### వెలుగులోకి ఒక్కొక్కరుగా..

### నమూనాలా ఆధారంగా చర్య తీసుకునే ఛాన్స్

బెంగళూరు,మే 23 (ప్రజా మంటలు):
బెంగుళూరు శివార్లలో జరిగిన రేవ్ పార్టీలో రోజు రోజుకీ కొన్ని సంచలన విషయాలు బయటపడుతున్నాయి. రేవ్ పార్టీలో పాల్గొన్న నటి హేమ బ్లడ్లోఓ డ్రగ్స్ నమూనాలు ఉన్నట్లు గుర్తించారు. రేవ్ పార్టీలో పాల్గొన్నా వారందరి రక్త నమూనాలు సేకరించిన బెంగుళూరు పోలీసులు పరీక్షకి పంపించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అందులో టాలీవుడ్ నటి హేమ రక్త నమూనాల్లో డ్రగ్స్ ఉన్నట్లు నార్కొటిక్ టీమ్ పేర్కొంది. ఇప్పుడు ఈ విషయంతో రేవ్‌పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని హేమ చెప్పిన మాటలు అన్ని అబద్దాలే అని తేలిపోయింది. ఈ రేవ్ పార్టీ తరువాత హేమ తాను అక్కడ లేనట్టుగా చిత్రీకరించడానికి బిర్యానీ ఎలా చేస్తారు లాంటి మామూలు వీడియోలు విడుదల చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చాలా ప్రయత్నాలు చేసింది. కానీ ఇప్పుడు ఆమె రక్త నమూనాలో మాదకద్రవ్యాలు తీసుకున్నట్టుగా రూఢీ కావటంతో ఇక ఆమె ఎన్ని చెప్పినా, ఆమె ఆ పార్టీలో వుంది, మాదకద్రవ్యాలు సేవించింది అనే విషయం స్పష్టం అయింది. 'సన్ సెట్ టు సన్ రైజ్ విక్టరీ' పేరుతో బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ జీఆర్ ఫామ్ హౌస్‌లో గత ఆదివారం రేవ్‌పార్టీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ రేవ్‌పార్టీలో పాల్గొన్న 103 మంది రక్త నమూనాలను ఇటీవల బెంగళూరు నార్కొటిక్ టీమ్ సేకరించింది. 103 మందిలో మొత్తం 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. 59 మంది పురుషుల, 27 మంది మహిళల రక్త నమూనాలు పాజిటివ్ అని తేలింది. నటి హేమ కూడా డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. రక్త నమూనాలు పాజిటివ్‌గా తేలిన వారందరికీ సీసీబీ సమన్లు జారీ చేయనుంది. అదే రేవ్‌పార్టీ జరిగిన ఫామ్‌హౌస్‌లోనే నటి హేమ ఉందని, ఆమె వీడియో అక్కడే రికార్డ్ చేసిందని బెంగళూరు పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు.తాను రేవ్‌పార్టీలో పాల్గొనలేదని, ఆ సమయంలో హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ అప్పట్లో ఓ వీడియో విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే రేవ్‌పార్టీకి తాను వెళ్లలేదంటూ రిలీజ్ చేసిన



వీడియోలో ఆమె ఏ డ్రస్‌తో ఉన్నారో, బెంగళూరు పోలీసులు విడుదల చేసి ఫొటోలోనూ అదే డ్రస్‌లో ఉన్నారు. దాంతో హేమ చెప్పేది అబద్ధం అని అప్పుడే స్పష్టం అయింది. అయినా కూడా హేమ తాను హైదరాబాద్‌లోనే ఉన్నానంటూ మరో వీడియో వదిలారు. చివరకు బ్లడ్ శాంపిల్స్ పాజిటివ్‌గా రావడంతో ఆమె బండారం బయటపడింది.డ్రగ్స్ టెస్ట్‌లో హేమకి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. హేమతో పాటు డ్రగ్స్ టెస్ట్‌లో మొత్తం 86 మందికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు ప్రకటించారు. హేమను బాధితురాలుగా పరిగణించే అవకాశముంది.



# సెన్సెక్స్, నిఫ్టీ ఆల్‌టైమ్ రికార్డ్..

## సూచీల లాభాల పరుగుకు కారణాలు ఇవే..!

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు.. ఆర్‌బీఐ డివిడెండ్, ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో ఒక్కసారిగా భారీ లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త జీవనకాల గరిష్ఠాలను నమోదుచేశాయి. సెన్సెక్స్ దాదాపు 1200 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 22,900 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 74,253.53 పాయింట్ల (క్రితం ముగింపు 74,221.06) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. తర్వాత లాభాల జోరు మొదలైంది. ఆద్యంతం అదే ఒరవడి కొనసాగింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 75,499.91 పాయింట్ల వద్ద సరికొత్త గరిష్ఠాలను అందుకుంది. చివరికి 1196.98 పాయింట్ల లాభంతో 75,418.04 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 369.85 పాయింట్ల లాభంతో 22,967.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో నిఫ్టీ 22,993.60 వద్ద కొత్త రికార్డును నెలకొల్పింది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ షేర్లు మినహా అన్ని షేర్లూ లాభపడ్డాయి.

**కారణాలు ఇవే..**

ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ అంచనాలను మించి ఆర్‌బీఐ తాజాగా కేంద్రానికి డివిడెండ్ ప్రకటించడం సూచీల పరుగుకు కారణమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.2.11 లక్షల కోట్లను ఆర్‌బీఐ ప్రభుత్వానికి అందించనుంది. ఈ మొత్తం కేంద్రం తన ద్రవ్యలోటు పూడ్చుకోవడానికి ఉపయోగపడనుంది. ఆర్‌బీఐ నుంచి రూ.లక్ష కోట్లు వస్తాయని మార్కెట్ ముందుగా అంచనా వేసింది. అంతకు డబుల్ డివిడెండ్ ఆర్‌బీఐ ప్రకటించడం గమనార్హం. మౌలిక సదుపాయాల కల్పనకు ఈ మొత్తాన్ని కేంద్రం వినియోగించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సమరం తుది దశకు చేరుకుంది. తొలినాళ్లలో పోలింగ్ తగ్గడం మదుపర్లలో ఆందోళన వ్యక్తమైంది. ఐదు దశల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో మరోసారి స్థిరమైన ప్రభుత్వమే ఏర్పడొచ్చన్న అంచనాలు బలపడడం మదుపరుల్లో ఉత్సాహం నింపింది. ఇదే ఆందోళనలతో విదేశీ సంస్థాగత మదుపర్లు సైతం అమ్మకాలకు దిగారు. తాజాగా దేశీయ మార్కెట్లలో కొనుగోళ్లకు దిగడం సూచీల పరుగుకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తాజాగా హెచ్ఎస్‌బీసీ వెలువరించిన డేటా కూడా సూచీలు రాణించడానికి మరో కారణం. దేశంలో ఎగుమతులు పెరిగాయని, మే నెలలో ఉద్యోగ కల్పన 18 ఏళ్ల గరిష్ఠానికి చేరడమూ మరో పాజిటివ్ అంశమని నిపుణులు భావిస్తున్నారు.

# ఎయిరిండియా ఉద్యోగులకు వేతన పెంపు..




దిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా తమ ఉద్యోగులకు వేతన పెంపు ప్రకటించింది. పైలట్ల పనితీరు ఆధారంగా బోనస్ కూడా చెల్లించనుంది. ప్రభుత్వం నుంచి టాటాల చేతికొచ్చాక టాటా గ్రూప్ చేపట్టిన తొలి వేతన పెంపు ఇదే. ఈమేరకు వేతన పెంపు వివరాలను ఎయిరిండియా సీహెచ్ఆర్ఓ రవీంద్రకుమార్ జీపీ వెల్లడించారు. 2024 ఏప్రిల్ నుంచి పెరిగిన వేతనాలు అమల్లోకి వస్తాయని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ, వ్యక్తుల పనితీరు ఆధారంగా ఈ బోనస్ చెల్లిస్తున్నట్లు చెప్పారు. 2023 డిసెంబర్ 31 కంటే ముందు సంస్థలో చేరినవారికి ఈ పెంపు వర్తిస్తుంది. దీని ప్రకారం.. ఫస్ట్ ఆఫీసర్, కెప్టెన్ల వేతనం నెలకు రూ.5 వేలు మేర పెరగనుంది. కమాండర్ల వేతనం రూ.11 వేలు, సీనియర్ కమాండర్ వేతనం రూ.15 వేలు చొప్పున పెరగనుంది. జూనియర్ ఫస్ట్ ఆఫీసర్‌కు ఎలాంటి పెంపూ చేపట్టలేదు. అలాగే పనితీరు ఆధారంగా ఏడాదికి గరిష్ఠంగా బోనస్ కింద రూ.1.8 లక్షల వరకు చెల్లించనుంది. జూనియర్ ఫస్ట్ ఆఫీసర్‌కు రూ.42 వేలు, ఫస్ట్ ఆఫీసర్‌కు రూ.50వేలు, కెప్టెన్లకు రూ.60 వేలు, కమాండర్లకు రూ.1.32 లక్షలు, సీనియర్ కమాండర్లు రూ.1.80 లక్షల వరకు గరిష్ఠంగా బోనస్ అందుకుంటారు. ఎయిరిండియాలో ప్రస్తుతం 18 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఎయిరిండియా గ్రూప్‌లో ప్రస్తుతం నాలుగు విమానయాన సంస్థలు ఉన్నాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్ (ఎయిర్‌ఏషియా ఇండియా)బీ ఎయిరిండియాలో విస్తారా విలీనం కానున్నాయి. 2022 జనవరిలో ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను దక్కించుకున్న టాటా గ్రూప్.. కాంట్రాక్ట్‌ల పునరుద్ధరణ, పరిహారం చెల్లింపు వంటివి మాత్రమే చేపట్టింది. దాదాపు రెండేళ్ల తర్వాత వేతన పెంపు చేపట్టింది.



# కాళ్లు, చేయి లేకున్నా బేస్‌క్యాంపును అధిరోహించిన కౌశిక్

పణజీ: విధి వంచించింది. ప్రమాదంలో ఓ చేయి, రెండు కాళ్లు పోయాయి. అయితేనేం.. తన ఆశయానికి అంగవైకల్యం అడ్డే కాదని భావించారు. ఎవరెస్టు బేస్ క్యాంపునకు చేరుకుని విజయ కేతనం ఎగురవేశారు.

ఆయనే గోవాకు చెందిన 30 ఏళ్ల టింకేశ్ కౌశిక్. తొమ్మిదేళ్ల ప్రాయంలోనే కరెంట్ షాక్‌తో రెండు కాళ్లు, ఓ చేయి కోల్పోయారు. కృత్రిమ అవయవాలను వాడుతున్నారు. కొన్నేళ్ల క్రితం గోవాకు వచ్చిన కౌశిక్ ఫిట్‌నెస్ కోచ్‌గా పని చేస్తున్నారు. ఎలాగైనా ఎవరెస్టును అధిరోహించాలని ఆశయంగా పెట్టుకున్న ఆయన.. అందుకోసం తీవ్రంగా శ్రమించారు. ఈ నెల 4న నేపాల్ నుంచి సాహసయాత్ర ప్రారంభించి 11న బేస్ క్యాంపుపై జాతీయజెండా ఎగురవేశారు. "ఫిట్‌నెస్ కోచ్ అయినందున పర్వతారోహణ చాలా తేలిక అని భావించా. కానీ, దానికి సన్నద్ధమవుతోన్న సమయంలో బేస్ క్యాంపు వరకు వెళ్లడం సాహసమేనని గుర్తించా. ఎలాగైనా సాధించాలని నిశ్చయించుకున్నా. శారీరక వైకల్యంతోపాటు పర్వతాల్లో ప్రతికూల వాతావరణం కూడా ఎంతో ఇబ్బంది పెట్టింది. అయినప్పటికీ మనోధైర్యంతో ముందుకువెళ్లా. వారం రోజుల పాటు ఈ యాత్ర కొనసాగింది. చివరకు ఎవరెస్టు బేస్‌క్యాంపును చేరుకున్నా. అవి నాకెంతో భావోద్వేగ క్షణాలు" అని కౌశిక్ వివరించారు.

మూడు అవయవాలు 90శాతం కోల్పోయి.. ఎవరెస్టును అధిరోహించిన తొలి వ్యక్తిగా కౌశిక్ రికార్డు సృష్టించారని గోవా వికలాంగ సంఘం పేర్కొంది. దివ్యాంగులకు ఆదర్శంగా నిలవడంతోపాటు గోవాకు ఇదెంతో గర్వకారణమని ఆ సంస్థ చీఫ్ అవెలినో డిసౌజా అభిప్రాయపడ్డారు. కౌశిక్ ఈ ఘనత సాధించడంపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ స్పందిస్తూ.. రాష్ట్రం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ విజయం యువతకెంతో స్ఫూర్తిదాయకమని, ఆయనకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తున్నానని ట్వీట్ చేశారు.

## స్విగ్గీ- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్

# క్యాష్‌బ్యాక్‌లో మార్పులు

క్రెడిట్ కార్డులపై ప్రయోజనాల్లో మార్పులు తీసుకురానున్నట్లు ఇప్పటికే అనేక బ్యాంకులు, కార్డు జారీ సంస్థలు ప్రకటించాయి. తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా అదే జాబితాలో చేరింది. స్విగ్గీతో కలసి అందిస్తున్న కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు ప్రయోజనాల్లో మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు అందిస్తున్న క్యాష్‌బ్యాక్ ఆఫర్లను అప్‌డేట్ చేసినట్లు పేర్కొంది. ఈ కొత్త మార్పులు జూన్ 21 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటివరకు స్విగ్గీలో చేసే కొనుగోళ్లపై వచ్చే క్యాష్‌బ్యాక్ స్విగ్గీ మనీ వాలెట్‌లో జమయ్యేది. ఇకపై ఆ సదుపాయం ఉండదు. ఆ క్యాష్‌బ్యాక్ క్రెడిట్ కార్డ్ అకౌంట్లో కనిపించనుంది. జూన్ 20 వరకు మాత్రం స్విగ్గీ మనీలోనే క్యాష్‌బ్యాక్ డిపాజిట్ అవుతాయి. కార్డ్ స్టేట్‌మెంట్ జనరేట్ అయిన 10 రోజుల తర్వాత క్యాష్‌బ్యాక్ క్రెడిట్ అయ్యేది. జూన్ 20 తర్వాత ఈ పద్ధతి మారనుంది. కార్డ్ స్టేట్‌మెంట్ ప్రతినెలా 15వ తేదీ జనరేట్ అవుతుంటే తరువాతి నెలలో ఆ క్యాష్‌బ్యాక్ కనిపిస్తుంది. ఉదాహరణకు.. జులై 15 నుంచి ఆగస్టు 14 మధ్య సంపాదించిన క్యాష్‌బ్యాక్ ఆగస్టు స్టేట్‌మెంట్‌లో కనిపిస్తుంది. అంటే ఆ మేర తగ్గించి మిగిలిన మొత్తం చెల్లించుకోవచ్చు.




ఇక ఈ కార్డు విషయానికొస్తే.. స్విగ్గీ- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా చేసే ఆన్‌లైన్ కొనుగోళ్లపై 5 శాతం క్యాష్‌బ్యాక్, స్విగ్గీలో కొనుగోళ్లపై 10 శాతం క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. ఆ కార్డుతో చేసే ఆఫ్‌లైన్ చెల్లింపులపై కూడా క్యాష్‌బ్యాక్ పొందొచ్చు. కార్డ్ యాక్టివేట్ అయిన తర్వాత 3 నెలల పాటు వెల్‌కమ్ ఆఫర్ కింద స్విగ్గీ వన్ సభ్యత్వం ఇస్తోంది. కార్డు జాయినింగ్ ఫీ, పునరుద్ధరణ రుసుము రూ.500. ఏడాదిలో రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేస్తే రెన్యువల్ ఫీ ఉండదు.

# క్రెడిట్ కార్డును ఉపయోగించుకోవడానికి చిట్కాలు

క్రెడిట్ కార్డు ఒక విస్తృతంగా ఉపయోగించే ఆర్థిక సాధనంగా పనిచేస్తుంది. కార్డుదారుడికి తాత్కాలిక క్రెడిట్ లైన్ (రుణం) అందించడం వల్ల కొనుగోలు సామర్థ్యం పెరుగుతుంది.

మీకు అత్యవసర పరిస్థితిలో తక్షణం డబ్బు అవసరమైతే నగదు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. కొవిడ్ తర్వాత కాంటాక్ట్‌లెస్ చెల్లింపులకు ప్రాధాన్యతమిస్తూ.. ఆర్‌బీఐ కాంటాక్ట్‌లెస్ కార్డులపై లావాదేవీల గరిష్ఠ పరిమితిని మునుపటి రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచింది. ఏది ఏమైనప్పటికీ క్రెడిట్ కార్డులను సరిగ్గా ఉపయోగించుకుంటేనే ప్రయోజనముంటుంది. క్రెడిట్ కార్డు కొనుగోళ్లు, చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తే కోలుకోలేని ఆర్థిక వైఫల్యాలకు దారి తీయొచ్చు. జాగ్రత్త వహించకపోతే కార్డు వినియోగం ఎక్కువై గణనీయమైన ఆర్థిక ఇబ్బందులకు దారితీయవచ్చు. మీ క్రెడిట్ కార్డును పొందడం నుంచి ఉపయోగించడం వరకు కొన్ని చిట్కాలు, జాగ్రత్తలు ఇక్కడ ఉన్నాయి.

**క్రెడిట్ కార్డు ఎంపిక**

కేవలం ఏజెంట్ సిఫార్సులు, స్నేహితుల నుంచి సలహాలు, ప్రీ అప్రూవ్డ్ ఆఫర్లపై ఆధారపడి క్రెడిట్ కార్డులను ఎంపిక చేసుకోకూడదు. కార్డులను ప్రమోట్ చేసేవారు అసంపూర్ణ సమాచారం అందించి అంతగా ఉపయోగం లేని క్రెడిట్ కార్డును అందిస్తారు. ఈ ఆఫర్లు వార్షిక రుసుమును మాఫీ చేయడానికి ఇతర షరతులతో రావచ్చు. కాబట్టి కార్డును తీసుకునేటప్పుడు ఫైన్ ప్రింట్‌ను పూర్తిగా చదవండి. కార్డు ఉచితం అంటే పూర్తిగా ఉచితమని ఎప్పుడూ అనుకోకండి. కార్డుపై ఏడాదికి కనీస మొత్తం ఉపయోగిస్తేనే రుసుం లేకుండా ఉంటుంది.

**బడ్జెట్**

ఆర్థిక నిర్వహణకు బడ్జెట్ అనేది ఒక ముఖ్యమైన సాధనం. వివిధ క్రెడిట్ కార్డు ఎంపికలు అందుబాటులో ఉన్నందున, క్రెడిట్ కార్డు పరిమితి వారి నెలవారీ ఆదాయం కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. క్రెడిట్ కార్డును ఉపయోగించేటప్పుడు డబ్బు ఖర్చవుతున్నట్లు అనిపించదు. ప్రత్యేకించి రివార్డు పాయింట్స్ లేదా క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలపై దృష్టి కేంద్రీకరించినప్పుడు అనుకోకుండా మీ బడ్జెట్‌ను అధిగమిస్తుంది. నగదు/డెబిట్ కార్డుల్లా కాకుండా, క్రెడిట్ కార్డులతో చేసే ఖర్చు తక్షణ ఆర్థిక ప్రభావం చూపించదు. బిల్లు తర్వాత వస్తుంది. మీ క్రెడిట్ కార్డు వినియోగాన్ని గమనించడానికి డైరీని లేదా ఖర్చుల జాబితాను నిర్వహించండి. ఏ కేటగిరీలోనైనా అధిక వ్యయం చేయకుండా, ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించండి. క్రెడిట్ కార్డు ఖర్చు మీ బడ్జెట్‌ను దాటనీయొద్దు.

**బిల్లు చెల్లింపులు**

క్రెడిట్ కార్డు బిల్లును గడువు తేదీకి ముందే చెల్లించాలి. అలాగే బకాయి ఉన్న దాంట్లో కనీస మొత్తాన్ని కాకుండా మొత్తం బకాయిని చెల్లించడం అలవాటు చేసుకోండి. దీనివల్ల క్రెడిట్ స్కోరు పెరగడమే కాకుండా జరిమానా రుసుముల నుంచి తప్పించుకోవచ్చు. క్రెడిట్ కార్డు బిల్లులపై చెల్లింపులను ఆలస్యం చేయడం వల్ల అనేక పరిణామాలకు దారితీయొచ్చు. క్రెడిట్ కార్డులపై వడ్డీ ఛార్జీలు బిల్లింగ్ సైకిల్ ముగిసే సమయానికి కాకుండా గడువు తేదీ తర్వాత రోజునుంచే మొదలవుతాయి. గడువు దాటితే వడ్డీ (జరిమానా) తప్పదు. క్రెడిట్ కార్డు వడ్డీ రేట్లు విపరీతంగా ఉంటాయి.. 15-36% వరకు ఉండొచ్చు. చెల్లించని బ్యాలెన్స్ కాలక్రమేణా గణనీయంగా పెద్ద రుణంగా పెరిగే అవకాశం ఉంది. ఆలస్యమయ్యేకొద్దీ వడ్డీపై వడ్డీ కూడా వసూలు చేస్తారు. ఇది మీ రుణాన్ని మరింత పేరుకుపోయేలా చేస్తుంది. బిల్లు చెల్లించేటప్పుడు కనీస చెల్లింపుల మొత్తాన్ని చెల్లించినా.. వారు పూర్తిగా బకాయి చెల్లించే వరకు ఆ మొత్తంపై వడ్డీని చెల్లించవలసి ఉంటుంది. ఇలాంటి వాటి వల్ల క్రెడిట్ స్కోరు కూడా దెబ్బ తింటుంది.

**గరిష్ఠ పరిమితి వద్దు**

మీరు క్రెడిట్ కార్డును ఉపయోగిస్తున్నప్పుడు మీ వద్ద డబ్బు లేకుండానే ఖర్చు చేస్తుంటారు. ఇది వినియోగదారులను అధిక వ్యయం చేసేలాగా ప్రొత్సహిస్తుంది. అందుచేత, పరిస్థితులు ఎలా ఉన్నా మీ క్రెడిట్ కార్డు వినియోగాన్ని పరిమితిలో 2/3వ వంతుకు పరిమితం చేయాలి. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు పరిమితి నెలకు రూ.3 లక్షలు అయితే, మీరు రూ.2లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయని విధంగా దాని వినియోగాన్ని ప్లాన్ చేయండి. ఇది మెరుగైన క్రెడిట్ స్కోరును నిర్వహించడానికి మీకు సహాయం చేస్తుంది. కొన్ని బ్యాంకులు క్రెడిట్ కార్డుపై వ్యక్తిగత వ్యయ పరిమితిని సెట్ చేసుకునే సదుపాయాన్ని అందిస్తున్నాయి. ఖర్చుపై అదుపు లేనివారికి ఇది మంచి ఎంపిక.

**స్టేట్‌మెంట్ తనిఖీ**

మీ క్రెడిట్ కార్డు బిల్లు వచ్చిన తర్వాత స్టేట్‌మెంట్‌ను నిశితంగా పరిశీలించండి. ఈ స్టేట్‌మెంట్‌ను సరిపోల్చడానికి, మీరు ఎప్పుడు క్రెడిట్ కార్డు ఉపయోగించినా ఆ ఖర్చు వివరాలను ప్రతినెలా ఒక బుక్‌లో




రాయండి. వీటిని ఆ నెల కార్డు స్టేట్‌మెంట్‌లో వివరాలతో సరిచూసుకోండి. వస్తువులు కొనుగోలు చేసినప్పుడు చెక్-అవుట్/%ూూూ% వద్ద మీరు అందుకున్న చెల్లింపు రసీదులతో బిల్ చేసిన స్టేట్‌మెంట్‌ను లెక్కించడం మంచి అలవాటు. ఏవైనా అదనపు ఛార్జీలను గుర్తించి నివారించడంలో ఇది సహాయపడుతుంది.

**ఆఫర్లు, రివార్డ్స్**

క్రెడిట్ కార్డు సంస్థలు ఎప్పటికప్పుడు రివార్డులు, ప్రోత్సాహకాలను అందిస్తాయి. ఇది క్యాష్‌బ్యాక్ లేదా ఉచిత వోచర్స్ రూపంలో ఉండొచ్చు. తాజా ఆఫర్ల కోసం మీ బ్యాంకును సంప్రదించండి. చాలామందికి తెలియని కొన్ని ప్రామాణిక క్రెడిట్ కార్డు ప్రయోజనాలు ఉన్నాయి. ఉదాహరణకు కార్డుదారుడు ప్రమాదంలో మరణించినా లేక అంగవైకల్యానికి గురయినా..చాలా భారతీయ క్రెడిట్ కార్డులపై కాంప్లిమెంటరీ బీమా సౌకర్యం ఉంటుంది. అంతేకాకుండా, మీకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయడానికి మీ రివార్డ్ పాయింట్లు కూడా ఉపయోగించవచ్చు.

చివరిగా: క్రెడిట్ కార్డును బాధ్యతాయుతంగా ఉపయోగించినప్పుడే ప్రయోజనకరమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ఇది రోజువారీ ఖర్చులకు ఉపయోగపడడమే కాకుండా, రివార్డు పాయింట్లు, క్యాష్‌బ్యాక్ సౌకర్యాలు, ఆఫర్లతో ఇది మీ సాధారణ డెబిట్ కార్డు కంటే మెరుగైన ప్రయోజనాలను అందిస్తుంది.



# ఐఐటీల్లోనూ ఉద్యోగ సంక్షోభం..

## 38%మందికి దక్కని కొలువులు!

ఖరగ్‌పూర్: మన దేశంలో ఐఐటీలకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో చదివితే చాలు.. మంచి కంపెనీల్లో ఉద్యోగాలు, రూ.లక్షల్లో వేతన ప్యాకేజీల్లాంటి మాటల్నే తరచూ వింటూ ఉంటాం. కానీ, ప్రస్తుతం నిరుద్యోగం పెరగడంతో అందుకు భిన్నమైన పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. మన దేశంలోని ఐఐటీల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో ఈ ఏడాది దాదాపు 38శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ దక్కకపోవడం గమనార్హం. ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి ధీరజ్‌సింగ్ సమాచార హక్కు చట్టం (%ా×%) ద్వారా సేకరించిన సమాచారంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.

ఈ ఏడాది మొత్తం 23 ఐఐటీ క్యాంపస్‌ల్లో దాదాపు 8వేల మంది (38శాతం) ఐఐటీయన్లకు ప్లేస్‌మెంట్స్ దక్కలేదని తేలింది. 2024లో 21,500 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ కోసం నమోదు చేసుకోగా.. కేవలం 13,400 మంది మాత్రమే ప్లేస్‌మెంట్స్ సాధించారని.. మిగతా వారు (38శాతం) ఇంకా కొలువుల కోసం అన్వేషిస్తున్నట్లు వెల్లడైంది. రెండేళ్ల క్రితం నాటితో పోలిస్తే ఈ పరిస్థితి దాదాపు రెట్టింపు అయినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. పాత తొమ్మిది ఐఐటీల్లో ఈ ఏడాది 16,400 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ కోసం నమోదు చేసుకోగా.. వారిలో 6,050 (37%) మందికి ఇంకా ఉద్యోగాలు దక్కలేదు. కొత్త 14 ఐఐటీల్లో అయితే ఈ పరిస్థితి మరింత క్షీణించింది. 5,100 మంది ప్లేస్‌మెంట్స్ కోసం నమోదు చేసుకోగా.. ఇంకా 2,040 మందికి కొలువులు రాలేదని తేలింది. గతేడాది కాన్పూర్ ఐఐటీ, ఖరగ్‌పుర్ ఐఐటీల్లో 33శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ దక్కలేదని ధీరజ్‌సింగ్ తన లింక్డిన్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో సంక్షోభ పరిస్థితుల కారణంగా ఇంకా ఉద్యోగాలు రాని విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, నిస్సహాయతతో ఉన్నారని ఆయన తెలిపారు.


ఐటీ దిల్లీలో గత ఐదేళ్లలో 22శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు దక్కకపోగా.. 2024కు వచ్చేసరికి 40శాతం మందికి అదే పరిస్థితి ఎదురైంది. 2022 నుంచి 2024 వరకు పాత తొమ్మిది ఐఐటీల్లో నమోదు చేసుకున్న విద్యార్థుల సంఖ్య 1.2 రెట్లు పెరగ్గా.. ఉద్యోగాలు సాధించనివారి సంఖ్య 2.1 రెట్లు పెరిగింది. అలాగే, నూతన ఐఐటీల్లో నమోదిత విద్యార్థుల సంఖ్య 1.3 రెట్లు పెరిగింది. కానీ ప్లేస్‌మెంట్స్ దక్కని విద్యార్థుల సంఖ్య కూడా 3.8 రెట్లు పెరిగింది. ఈ సంక్షోభం విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది ఆరుగురు ఐఐటీ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా.. అనేకమంది తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి.

# హద్దులు దాటి వధువుకు 'కిస్సు'..

## కర్రలతో కొట్టుకున్న ఇరు కుటుంబాలు

**లఖ్‌నవూ:** వరుడి విపరీత చర్యతో కల్యాణ వేదిక రణరంగంగా మారింది. వరమాల క్రతువు పూర్తయిన తర్వాత వధువును అతడు బహిరంగంగా ముద్దు పెట్టుకోవడం వివాదానికి కారణమైంది.

చివరకు ఇరువర్గాల వారు కర్రలతో దాడి చేసుకునేవరకు వెళ్లింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాపూర్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ వ్యక్తి తన ఇద్దరు కుమార్తెల వివాహాలను హాపూర్‌లోని అశోక్‌నగర్‌లో ఏర్పాటుచేశాడు. ఒక కుమార్తె వివాహం ఎలాంటి ఇబ్బందీ లేకుండా పూర్తయింది. అది పూర్తయిన కొద్దిసేపటి తర్వాత మరో కుమార్తె లగ్నం జరుగుతోంది. వరమాల వేయడం పూర్తయిన తర్వాత వరుడు, వధువుకు బహిరంగంగా ముద్దు పెట్టాడు. ఇది ఆమె బంధువులకు నచ్చలేదు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.



అంతలోనే వధువు బంధువులు కొందరు స్టేజీ పైకి చేరుకొని వరుడు, అతడి కుటుంబసభ్యులపైన దాడికి దిగారు. ఇరువర్గాల వారు పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. దీంతో కల్యాణవేదిక కాస్తా, రణరంగంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులైన ఏడుగురిని ఆస్పత్రికి తరలించారు. తమ కుమార్తె నిరాకరిస్తున్నా అందరిముందు ముద్దు పెట్టుకున్నాడని వధువు కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆమె అంగీకారంతోనే ముద్దు పెట్టానని వరుడు చెబుతున్నాడు. ఈ ఘటనపై రాత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, బాధితులెవరైనా ముందుకొస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని స్థానిక పోలీసు అధికారి తెలిపారు. అయితే, ప్రజాశాంతికి భంగం కలిగించినందుకుగాను ఆరుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు.

## రాము తెలివి






అనగనగా గుండారం ఊరు. ఆ ఊరిలో సురేశ్, సువర్ణ అనే దంపతులు ఉన్నారు.వీరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు.వీరిది ఉత్తమ కుటుంబం. వీరికి రాము అను కొడుకు ఉన్నాడు. అతడు రెండవ తరగతి చదువుతున్నాడు. రోజు బడికి పోతాడు. సాయంకాలం దోస్తులతో ఆడుకుంటాడు. టైరును కట్టెతో తోలడం, సైకిల్తో అటిటు తిప్పడం,పాండబ్బ ఆడటం ,గోటీలు ఆడటం చేస్తాడు. రాముకు నాయనమ్మ రేణుక ఉంది. నాయనమ్మ అంటే రాముకు ఎంతో ఇష్టం. నాయనమ్మకు రాము అంటే ఇష్టం.

సువర్ణ కాయలు,పండ్లు నాయనమ్మకు ఇచ్చిరా అనగానే నిమిషంలో ఇచ్చి వస్తాడు. నాయనమ్మ ఇవి తిను అంటాడు. అన్నం తెచ్చి తినుమంటాడు. రోజు నాయనమ్మ దగ్గర కథలు చెప్పించుకుంటాడు. రాముకు సాహసం కథలంటే చాలా ఇష్టం. సురేష్, సువర్ణ రోజు పొలం పనులకు వెళ్తుతారు. ఒకరోజు పగలు బడినుంచి వచ్చాడు. నాయనమ్మ నీళ్లని వెళ్లి కాళ్ళు జారి బావిలో పడింది. అది రాము వస్తూనే చూచాడు .

అయ్యో నాయనమ్మ అని అరిచాడు. చుట్టూ ఎవరు లేరు.

అప్పటికే బావి లోపల నీళ్లలోపడింది. ఉరికి ఇంట్లోనుంచి పొడుగు తాడు తెచ్చాడు. తాడుకొన బావిలో విసిరాడు. మరొక కొన పైన కట్టాడు. తాడును పట్టుకో నాయనమ్మా అని గట్టిగా పిలిచాడు.భయపడకు నాయనమ్మ అని అరిచాడు.ధైర్యం కోల్పోలేదు.తాడును పట్టుకుంది. ఆ అరుపులకు అందరూ జనం గుమిగూడారు. అయ్యో పాపం ముసలవ్వ అని కొందరు అంటున్నారు. ఎంత పని అయిపాయే అని మరికొందరు అనుకుంటున్నారు.

మంచి ముసలవ్వకు గిలాంటి ఆపద వచ్చే అని అనుకున్నారు. బావిలోకి దిగి ముసలవ్వను పైకి తీసారు. అందరినీ చూసింది.రామును చూడగానే ఆనందం పొంగింది . ఆత్మస్థైర్యం వచ్చింది.అయ్యో రాము నాయనా తాడు వేసి కాపాడావు. నిండా నూరేళ్ళు నా ఆయుస్సు కూడా పోసుకొని బతుకు నాయనా అని రాముకు దీవెనలు ఇచ్చింది. అందరు రాము తెలివికి, సమయస్ఫూర్తికి, సాహసానికీ మెచ్చుకున్నారు.

డా.వాసరవేణి పరశురాం.
బాలసాహిత్య రచయిత,
సింగారం, రాజన్న సిరిసిల్ల

## ఆధిపత్య యుద్ధాలలో పిల్లలే సమిధలు..

### యుద్ధం పిల్లల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

ప్రతి యుద్ధంలో మొదట బాధ పడేది పిల్లలే. యుద్ధం పిల్లల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

పిల్లలు ఎల్లప్పుడూ హాని నుండి రక్షించబడాలి. ఉక్రెయిన్‌లో ఘోరమైన దాడులు కొనసాగుతున్నందున 2023 తో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు చంపబడిన పిల్లల సంఖ్య దాదాపు 40 శాతం పెరిగిందని యుయన్ చిల్డ్రన్స్ ఫండ్ సంస్థ యూనిసెఫ్ హెచ్చరించింది. ఖార్కివ్ ప్రాంతంలో ఇటీవలి జరిగిన దాడుల్లో పౌరుల అనేక మంది చిన్నారులు మరణించారు. కొంతమంది అనాథలతో పాటు వైకల్యం ఉన్న పిల్లలు తీవ్రంగా గాయపడ్డారని యుయన్ ఆఫీస్ ఫర్ ది కోఆర్డినేషన్ ఆఫ్ హ్యూమానిటేరియన్ అఫ్ఫైర్స్ ( ఒసిహెచ్ఎ ) నివేదించింది. యుద్ధంలో దాదాపు 2000 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారని యూనిసెఫ్ తెలిపింది.

యుద్ధ ప్రభావం వలన పిల్లల చదువు ప్రధాన ఆందోళనగా మిగిలిపోయింది. దేశవ్యాప్తంగా, ఉక్రెయిన్‌లో 40 శాతం మంది పిల్లలు స్థిరంగా పాఠశాలకు హాజరు కాలేకపోతున్నారు. ఫ్రంట్‌లైన్ ప్రాంతాలలో మొత్తం పాఠశాల వయస్సు పిల్లలలో సగం మంది బడి బయట ఉన్నారు. 2300 పైగా దెబ్బతిన్న లేదా ధ్వంసమైన ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు భద్రతా కారణాల దృష్ట్యా మూసివేయబడ్డాయి.

పిల్లలు తమ ఇళ్లు, ఆట స్థలాలు, పాఠశాలలపై బాంబులు వేయడాన్ని చూశారు. ఈ హింసలలో వారి తల్లిదండ్రులను, వారి తోబుట్టువులను, దగ్గర వారిని కోల్పోయారు. మరికొంత మంది బలవంతంగా పారిపోవడం వలన కుటుంబ సభ్యుల నుండి విడిపోయారు. వారు ఆరోగ్య సంరక్షణ మరియు పాఠశాల నుండి దూరమయ్యారు. యుద్ధాల సమయంలో పాఠశాలలను నాశనం చేయడంతో విద్యకు అంతరాయం ఏర్పడింది. ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్‌లో సంఘర్షణ పెరగకముందే 1.7 మిలియన్ల పిల్లలకు మౌలిక సదుపాయాలు మురుగునీటి సౌకర్యాలు అందుబాటులో లేవు. యుద్ధం తరువాత పరిస్థితులు ఘోరంగా తయారయ్యాయి. పెద్దలవలె గాయాలతో పాటుగా అహారలేమికి, పోషకాహార లోపంతో అనారోగ్యానికి గురవుతున్నారు. నిత్యం సోషల్ మీడియాలో వీడియోలు చూస్తూ అక్కడ జరుగుతున్న కొన్ని చిత్రాలను చూసి ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. పిల్లలకు పునరావాస కేంద్రాలలో ఉండడం లేదా స్థానభ్రంశం చెందదనమనేది జీవిత కాల గాయం. ఐదుగురిలో ఒకరు అనుచిత ఆలోచనలతో, గతం తలచుకొని భవిష్యత్ గురించి ఆందోళన చెందుతున్నారు. విద్య అనేది పిల్లల జీవితాలలో ఆశ, అవకాశం, స్థిరత్వానికి మూలస్తంభం. అయితే ఇది ఉక్రెయిన్‌లోని మిలియన్ల మంది పిల్లలకు అందుబాటులో లేదు. విద్యార్థులు ఆన్లైన్ లేదా దూరవిద్యపై మాత్రమే ఆధారపడి విద్యకు పరిమిత ప్రాప్యత కలిగి ఉన్నారు

**పిల్లలపై యుద్ధప్రభావాలు:**

ఇది పిల్లల రక్షణ, మానసిక ఆరోగ్యం, మానసిక మద్దతు, ఆహారం, ఆరోగ్య సంరక్షణ, విద్య, స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత లాంటి పిల్లల అవసరాలను మరింత తీవ్రతరం చేస్తోంది. ప్రాథమిక అవసరాలకు ప్రాప్యత లేకపోవడం వల్ల పిల్లలు వారి శారీరక సామాజిక భావోద్వేగ, మానసిక అభివృద్ధిని కోల్పోతారు. వారి ప్రవర్తనలో ప్రతికూల మార్పులు వస్తాయి. పిల్లలు ఆందోళన, నిరాశ వంటి మానసిక సమస్యలకు అలాగే రోగనిరోధక వ్యవస్థ, కేంద్ర నాడీ వ్యవస్థలలో శారీరక సమస్యలకు గురవుతారు. చిన్నతనంలో



ఒత్తిడి పిల్లల మెదడు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. దీని ఫలితంగా శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఒత్తిడి ప్రతిస్పందన వ్యవస్థల యొక్క అధిక లేదా సుదీర్ఘ క్రియాశీలత వలన ఆరోగ్యకరమైన మెదడు మరియు శారీరక అభివృద్ధి దెబ్బతింటుంది. అడ్రినలిన్, కార్టిసాల్ రెండూ ఒత్తిడిని ఎదుర్కోవడానికి శరీరాన్ని సిద్ధం చేయడంలో సహాయపడినప్పటికీ అవి దీర్ఘకాలంగా అనియంత్రిత ఒత్తిడికి ఉపయోగించినప్పుడు, ఈ ఒత్తిడి ప్రతిస్పందన వ్యవస్థ మానసిక శారీరక ఆరోగ్యం రెండింటిలోనూ బలహీనతలకు దారి తీస్తుంది. చిన్న వయస్సులోనే కుటుంబం నుండి వేరు చేయబడిన పిల్లలు అనుబంధానికి సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటారు. కౌమారదశలో ఉన్నవారితో పోలిస్తే ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు నిరాశ మరియు ఆందోళనకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**తక్షణ అవసరాలు:**

ఆసుపత్రులు పాఠశాలలు లాంటి ప్రాథమిక మౌలిక సదుపాయాల ధ్వంసం పిల్లలు కనీస సంరక్షణ రక్షణ పొందకుండా చేస్తోంది. ఉక్రెయిన్‌లో పాఠశాలలో చేరిన దాదాపు సగం మంది పిల్లలు వ్యక్తిగతంగా పాఠశాల విద్యను కోల్పోతున్నారు. దేశవ్యాప్తంగా దాదాపు ఒక మిలియన్ మంది పిల్లలు అభద్రత కారణంగా వ్యక్తిగతంగా నేర్చుకునే అవకాశాలకు దూరమయ్యారు. నేడు ఉక్రెయిన్‌లో 2.9 మిలియన్ల మంది పిల్లలకు అత్యవసరంగా మానవతా సహాయం అవసరం. రష్యా యుద్ధం వల్ల ప్రభావితమైన ఉక్రెయిన్‌లోని పిల్లల పరిస్థితికి తక్షణ ప్రతిస్పందన అవసరం. యునిసెఫ్ నొక్కిచెప్పినట్లు ఉక్రెయిన్ పిల్లలకు తక్షణమే భద్రత, స్థిరత్వం, ఉక్రెయిన్ పిల్లలకు మానసిక శాంతి అవసరం.

యూనిసెఫ్ సేవలు:



**2023 లోనే యూనిసెఫ్ అధికారిక మరియు** అనధికారిక అభ్యాస అవకాశాలతో 1.3 మిలియన్ల పిల్లలకు మానసిక ఆరోగ్యం, మానసిక సామాజిక సహాయ సేవలతో 2.5 మిలియన్ల పిల్లలుకు వారి సంరక్షకులకు సహాయం చేసింది. గత రెండు సంవత్సరాలలో ఈ ప్రాంతంలో సుదీర్ఘకాలంగా

అగ్రగామిగా ఉన్న యూనిసెఫ్ తొమ్మిది లక్షల మంది పిల్లలతో సహా 112 కమ్యూనిటీలలోని 5.4 మిలియన్ల మందికి నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్)కి సురక్షితమైన ప్రాప్యతను అందించింది. నీరు, పారిశుద్ధ్య నెట్‌వర్క్‌లను మరమ్మత్తు పునరుద్ధరణపై దృష్టి సారించింది. వాష్ సేవలను పునరుద్ధరించడానికి మరియు నిర్వహించడానికి పైపులు, జనరేటర్లు, వెల్డింగ్ యంత్రాలు వంటి 3,16,300 పరికరాలను పంపిణీ చేసింది. 11 నీటి వినియోగాలకు 6,90,000 టన్నుల నీటి శుద్ధి రసాయనాలను పంపిణీ చేసింది. ఒడెస్కాలోని నాలుగు ఆసుపత్రుల ఆవరణలో, మైకోలైవ్‌స్కాలోని ఒక ఆసుపత్రుల ప్రాంగణంలో ఐదు బోర్లు వేయడం ద్వారా 90,000 మందికి ప్రయోజనం చేకూర్చింది. 394 పాఠశాలల్లో వాష్ సౌకర్యం కల్పించింది. ప్రధానంగా ఫ్రంట్‌లైన్ ప్రాంతాలలో 3,38,000 మంది పిల్లలతో సహా 2 మిలియన్లకు పైగా ప్రజలకు బాటిల్ వాటర్, వాటర్ ట్రక్కింగ్, వాటర్ ప్యూరిఫికేషన్ ట్యాబ్లెట్‌లు, వాటర్ ట్యాంక్‌లు మరియు హైజీన్ కిట్‌లతో సహా వాష్ సామాగ్రిని అందించింది.

**జనక మోహన రావు దుంగ**
**సోషల్ అనలిస్ట్,**
**8247045230**

# అలంకార ప్రాయంగా మిగిలి పోతున్న కామన్వెల్త్




కామన్వెల్త్ అనేది.. ఆయా దేశాలు ఎలాంటి లాంఛనప్రాయమైన కట్టుబాట్లూ లేకుండా.. సుహృద్భావంతో స్నేహపూర్వకంగా చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కలిసివుండటానికి గల ఒక మార్గం. కామన్వెల్త్... ప్రపంచంలోని మూడో వంతు జనాభా గల దేశాల కూటమి. ఎన్నో మతాలు, జాతులు, భాషలు, సంస్కృతుల వారు ఇందులో భాగంగా ఉన్నారు.

బ్రిటీష్ సామ్రాజ్యం దాని వలస రాజ్యాల స్థాపన ప్రక్రియను ప్రారంభించినప్పుడు, మాజీ బ్రిటిష్ కాలనీల నుండి స్వతంత్ర రాష్ట్రాల ఏర్పాటుకు, గతంలో సామ్రాజ్యంలో భాగమైన దేశాల సంస్థ యొక్క అవసరం ఏర్పడింది.

కామన్వెల్త్ దినోత్సవాన్ని అంతకు ముందు 'ఎంపైర్ డే' అని పిలిచేవారు. అప్పటి రాయల్ కామన్వెల్త్ సొసైటి అయిన రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ కెనడియన్ శాఖ 'ఎంపైర్ డే 'జరపాలన్న సూచన చేసింది. ఈ ప్రతిపాదనను 1898 లో కెనడియన్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సమావేశంలో ప్రవేశ పెట్టగా ఏకగ్రీవంగా అమోదించారు. అలా 'ఎంపైర్ డే ' ఓ జాతీయ కార్యక్రమమైనది. 1884 లో, లార్డ్ రోజ్‌బెరీ అనే బ్రిటిష్ రాజకీయ నాయకుడు మారుతున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని "కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్" గా అభివర్ణించాడు.

ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస పాలనలోని పలు దేశాలు స్వాతంత్ర్యం పొందటం ప్రారంభమైంది. ఆ క్రమంలో ఆయా దేశాలకు బ్రిటన్‌కు మధ్య.. ఆయా దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేందుకు ఒక రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ అవసరమైంది.

1916 మే 24 వ తేదీన యునైటెడ్ కింగ్డమ్ లో తొలిసారిగా 'ఎంపైర్ డే' ను దేశవ్యాప్తంగా జరుపుకున్నారు . 70 వేల స్కూళ్ళు , స్టాక్ ఎక్షేంజ్ వంటి సంస్థలు జెండా వందనం చేసి జాతీయ గీతంను ఆలపించారు. 1921 జనవరిలో 'ఎంపైర్ డే ' ఉద్యమాన్ని వీలైనంతగా ముందుకు తీసుకువెళ్ళాలని భావించిన ' మీథ్ రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ ను లాంచనంగా అహ్వానించారు. ఇన్స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ, మీథ్ బృందము కలిసి ఉద్యమ కార్యక్రమాలను రూపొందించారు. 1927 నుండి 1929 వరకు ఉద్యమ తొలి అద్యక్షుడుగా మీథ్ కొనసాగాడు. 1901 లో మరణించిన క్వీన్ విక్టోరియా జన్మదినం అయిన మే 24 వ తేదీన ఏటా 'ఎంపైర్ డే' నిర్వహించాలని నిర్ణయించారు .

అలా 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడింది. 1931 లో, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఐరిష్ ఫ్రీ స్టేట్, న్యూఫౌండ్లాండ్, యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికాతో... ఐదు ప్రారంభ సభ్యులతో బ్రిటిష్ కామన్వెల్త్ నేషన్స్ వెస్ట్ మినిస్టర్ శాసనం క్రింద స్థాపించ బడింది.

1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడగా, . 1949లో ఆ పేరు నుండి 'బ్రిటిష్' పదాన్ని తొలగించారు. ఆ కూటమిలో చేరటమనేది ఆయా దేశాల ఇష్టాయిష్టాల మేరకే జరుగుతుంది. అలా 53 దేశాలు ఇందులో సభ్యులుగా చేరాయి. చివరిగా చేరిన మొజాంబిక్, రువాండాలకు బ్రిటిష్ వలస రాజ్యంతో ఎలాంటి సంబంధం లేదు. బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తమైన దేశాల కూటమిగా అది మారింది.

ఆధునిక కామన్వెల్త్ కూటమి మొదట ఆస్ట్రేలియా, కెనడా, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, యూకేలు సభ్య దేశాలుగా స్వతంత్ర దేశాల 'ఫ్రీ అసోసియేషన్' పేరుతో అది ఏర్పడింది. ఆ తరవాత అది 'కామన్వెల్త్ నేషన్స్'గా రూపాంతరం చెందింది.

కామన్వెల్త్ కూటమిలో భాగమైన అత్యధిక దేశాలు బ్రిటిష్ సామ్రాజ్య పాలనతో ఏదో విధంగా సంబంధం ఉన్నవే. రవాండా, మొజాంబిక్ లాంటి దేశాలు మాత్రమే వాటికి అతీతం. రవాండా 2009లో, మొజాంబిక్ 1995లో కామన్వెల్త్ దేశాల కూటమిలో భాగమయ్యాయి. అవి గతంలో బ్రిటిష్ పాలనలో లేవు. ప్రపంచ దేశాలన్నింటి విస్తీర్ణంలో పావు భాగాన్ని కామన్వెల్త్ దేశాలే ఆక్రమిస్తున్నాయి.

విస్తీర్ణం పరంగా కెనడా కామన్వెల్త్ కూటమిలో తొలిస్థానంలో, ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, భారత్‌లు కూడా విస్తీర్ణం పరంగా చాలా పెద్దవి. సమోవా, టువాలు, ఆంటిగ్వా లాంటి చిన్న దేశాలు కూడా కూటమిలో భాగంగా ఉన్నాయి.

దాదాపు 790 కోట్ల ప్రపంచ జానాభాలో 260 కోట్ల మంది.. అంటే మూడో వంతు ప్రజలు కామన్వెల్త్ కూటమిలో భాగమైన 53 దేశాల్లోనే జీవిస్తున్నారు. ఈ దేశాల్లో ఎక్కువమంది 30 ఏళ్ల లోపువారే.

ఈ కూటమిలో జనాభా పరంగా భారతే అతిపెద్ద దేశం. మొత్తం కామన్వెల్త్ కూటమి దేశాల జనాభాలో సగం భారత్‌లోనే ఉంది. కూటమిలోని 31 దేశాల జనాభా 16 లక్షల కంటే తక్కువే.


2012 దాకా కామన్వెల్త్ కూటమికి ఎలాంటి రాజ్యాంగం లేదు. ఆ తరవాతే ప్రజాస్వామ్యం, లింగ సమానత్వం, శాంతి, భద్రత లాంటి 16 విలువలకు సభ్య దేశాలు కట్టుబడి ఉండాలని తీర్మానించు కున్నాయి. కామన్వెల్త్ సెక్రటేరియట్ లండన్‌లో ఉంది. విద్యా రంగం నుంచి పట్టణ ప్రణాళిక వరకూ అనేక రంగాల్లో కామన్వెల్త్ సంస్థలు కృషి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆయా దేశాల్లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసేందుకు పరిశీలకులు కూడా హాజరవుతుంటారు.

అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇతర దేశాల మీద ఆ కూటమి చూపే ప్రభావం ఏదీ లేదనే చర్చ ఉంది. సభ్య దేశాల మధ్య వాణిజ్య సంబంధాల కోసం కామన్వెల్త్ చేస్తున్నదేమీ లేదు. ఇందుకోసం అన్ని దేశాలూ ఏదో ఒక ప్రాంతీయ కూటమి లోనో అంతర్జాతీయ కూటమి లోనో భాగస్వాములుగా ఉన్నాయి. కామన్వెల్త్ అనేది రెండేళ్ల కోసారి కామన్వెల్త్ దేశాల రాజకీయ అధినేతల సమావేశం, నాలుగేళ్లకోసారి కొన్ని పతకాల కోసం క్రీడలను నిర్వహించే అలంకార ప్రాయమైన సంస్థగా మిగిలిపోతున్నదనే విమర్శలు కూడా లేక పోలేదు

### మే 24... కామన్వెల్త్ దినోత్సవం



## హనుమాన్ శోభాయాత్రకు రూ. 10,016 విరాళాన్ని అందజేసిన యూప్ టీవీ సీఈఓ



**జమ్మికుంట మే 23 (ప్రజామంటలు):**
వీణవంక మండల కేంద్రంలో వీణవంక గ్రామంలో హనుమాన్ భక్తి శ్రద్ధలతో పవిత్రమైన నియమ నిష్ఠలతో హనుమాన్ మాలధారణ ధరించిన 60 మంది హనుమాన్ భక్తులు అందరూ కలిసి మండల కేంద్రంలోని ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని భారీ హనుమాన్ శోభయాత్రని నిర్వహించాలని నిర్ణయించుకొని అందులో భాగంగా పాడి ఉదయ్ నందన్ రెడ్డి ని శోభాయాత్ర కోసం విరాళాన్ని అడిగారు. వెంటనే స్పందించిన పాడి ఉదయ్ నందన్ రెడ్డి గారు వారి అనుచరులతో హనుమాన్ శోభయాత్రకి రూ. 10,016 విరాళంగా అందించారు. హనుమాన్ మాలాదారణ భక్తులు మాట్లాడుతూ.... ఆ శ్రీరాముడు ఆంజనేయుని ఆశీస్సులు పాడి ఉదయ్ నందన్ రెడ్డి కి మరియు వారి కుటుంబ సభ్యుల పైన ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ స్వాములు మరియు మాజీ ఎక్స్ జెడ్పిటిసి దాసరపు ప్రభాకర్, అమృత ప్రభాకర్, సమీళ్ల చిట్టి, మంతెన శ్రీధర్, తాళ్లపెల్లి కుమార్ స్వామి, దాసారపు వంశీకృష్ణ, తోట్ల రాకేష్, సిరిగిరి రాజశేఖర్, కోరే రాకేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ మోడల్ జూనియర్ కళాశాలలో చేరండి

**మే 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకొండి**

**కళాశాల ప్రిన్సిపల్ బి. కుమార్**

**భీమదేవరపల్లి మే 23 (ప్రజామంటలు):**



పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు ప్రభుత్వ మోడల్ జూనియర్ కళాశాలలో చేరాలని, ఉత్తమ విద్యతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కళాశాల ప్రిన్సిపల్ బి కుమార్ తెలియజేశారు. 2024-25 సం. ఇంటర్ లో చేరే విద్యార్థుల కొరకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇంటర్ తో పాటు నీట్, ఐఐటి, జేఈఈ తో పాటు సాంకేతిక పరిజ్ఞానం కోసం టాలి, అకౌంటింగ్, ఎంఎస్ ఆఫీస్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ లపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మే 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణం చేసిన షెడ్డు నిర్మాణం

**పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**

**జగిత్యాల మే 23 (ప్రజామంటలు):**



జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీ పంలో ఇటీవల ఓ ఖాళీ స్థలంలో వ్యాపార నిమి త్తమై తాత్కాలికంగా షె డ్డు నిర్మాణం జరి గింది. నిర్మాణంలో ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా నిర్మించారని స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో చైర్ పర్సన్ కు స్థానికులు అధికారుల అలసత్వంపై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ నిజని ర్ధారణకై నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. యదార్ధంగా సెట్ బ్యాక్ లేకపోవడంతో నిర్మాణదారులు తమకు తాముగా సెట్ బ్యాక్ చేసుకొని నిర్మించుకోవాలని లేనట్లయితే మున్సిపల్ అధికారులచే తొలగించవలసి వస్తుందని నిర్మాణదారులకు చైర్పర్సన్ సూచించారు.

## పోయిన డబ్బులను మహిళకు అందజేసిన ట్రాఫిక్ పోలీస్



**జగిత్యాల మే 23 (ప్రజామంటలు):**
టవర్ సర్కిల్ వద్ద మ్యాంగోస్ అమ్ముతున్న మహిళ వద్ద రూ. 4700 పోయినవని అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ లక్ష్మీనారాయణ ను సంప్రదించగా ట్రాఫిక్ పోలీస్ లక్ష్మీనారాయణ అక్కడ ఉన్న సీసీ కెమెరాలు చూసి డబ్బులు దొరికిన వ్యక్తిని గుర్తించి ఆ డబ్బులను తిరిగి మహిళకు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా టవర్ వద్ద విధులు నిర్వహిస్తున్న హెచ్.జి.పి.ఎల్. సి. లక్ష్మీనారాయణ ను ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రం, ఏఎస్సై సంధాని తదితరులు అభినందించారు.

# తీగల ధర్మారంలో ఘనంగా గీతా హవన యజ్ఞం

## ధర్మపురి క్షేత్రంలో భక్త జన సందోహం



**ధర్మపురి మే 23 (ప్రజామంటలు):**
ధర్మపురి మండలంలోని తీగల ధర్మారం గ్రామంలోగల శ్రీకృష్ణ గీతాశ్రమంలో గురు వారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా గాయత్రి హవన యజ్ఞం ఘనంగా జరిగింది. శ్రీకృష్ణ గీతాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు వేముల రాజరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వ హించారు. 1980 మే 24వ తేదీన శ్రీహనుమద్దాసు సంకల్పంచే, పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ దయానందగిరి స్వాముల కరకమలములచే స్థాపించ బడిన ఈగీతాశ్రమం 43వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా 44వ వార్షికోత్సవ వేడుకలు గీతాశ్రమ వ్యవస్థాపకులు వేముల రాజ రెడ్డి నిర్వహణలో, జగిత్యాల శ్రీవిశ్వ గాయత్రి పరివార్ శ్రీకృష్ణాభిషేకం, పూజలు, నవ కుండ గాయత్రి యజ్ఞం, సామూహిక సంకీర్తన, శ్రీమద్భగవద్గీత సామూహిక పారాయణం, హవన యజ్ఞం, అఖండ నామ సంకీర్తన, పూర్ణా హుతి తదితర సాంప్రదాయ కార్యక్ర మాలను నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాసంగికుల ప్రవచనాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వంద లాది మంది భక్తులకు నిర్వాహకులు అన్నదానం గావించారు. గీతా భక్తులతో పాటు బీర్పూర్, ధర్మపురి మండలాలకు చెందిన భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. యజ్ఞనిర్వహణ గాయత్రీ పరివార్ జగిత్యాల, గీతాశ్రమ అధ్యక్షులు వేముల రాజిరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. యజ్ఞ నిర్వాహకులు మరియు వేముల రామ్ రెడ్డి, దేవస్థానం అధ్యక్షులు రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ జంగిల్ ప్రభాకర్ పందిరి తిరుపతి, అయిల్నేని ప్రభాకర్ రావు, గంధం రమేష్, పత్తిపాక తిరుపతి, మధుకర్, రాయమల్లు, మల్లేశం, సుధాకర్ రెడ్డి భక్తులు మరియు వివిధ గ్రామాల భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

**పౌర్ణమి మంగళ స్నానాలు:**
గోదావరీ తీరస్థ ప్రాచీన పుణ్య తీర్థ మైన ధర్మపురి క్షేత్రంలో వైశాఖ పౌర్ణమి పర్వదిన వేడుకలు గురువారం వైభవంగా, కన్నుల పండువగా జరిగాయి. వైశాఖ పౌర్ణమికి పలువిధ ప్రత్యేకతలు న్నాయి. విశాఖ నక్షత్రానికి కాంతిని వ్యాపింప చేసే వైశాఖి పర్వదినం నాడు సుబ్రహ్మణ్య స్వామి అవతారం ఎత్తినట్లు చెపుతారు. బుద్ధుడు ఈరోజుననే పుట్టువు నొందడం జరిగింది. బుద్ధుడు వైశాఖ పూర్ణిమ నాడే జన్మించిందీ, గౌతముడు బుద్ధుడు అయిందీ, నిర్యాణం చెందినదీ వైశాఖ పూర్ణిమ నాడే కావడం విశేషం. వైశాఖ పౌర్ణమి నాడు శివుడు శరభావతారం దాల్చాడు. ఈనాడే కూర్మజయంతిగా పేర్కొన బడింది. వైశాఖి పౌర్ణమి పర్వ దినాన నదీస్నానం, దానధర్మా చరణ గావించడం పరిపాటి. ఈసందర్భంగా గురు వారం నదీ స్నానం, దైవ దర్శనార్థం అధిక సంఖ్యాకులైన భక్తులు క్షేత్రానికి అరుదెంచారు. భక్తులు, యాత్రికులు, స్థానికులు ఉద యాత్పూర్వం నుండే పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, నదీ పురోహితులచే సంకల్పం, దానధ ర్మాది సత్కర్మలను ఆచరించి, దైవ దర్శ నార్థం దేవస్థానంలోని ప్రధానాల యాల ముందు బారులు తీరి నిలుచున్నారు. వేకువ జామునే ఆలయాల అర్చకులు వేద మంత్రాలతో, మంగళ వాద్యాలతో దేవస్థానం నుండి గోదావరికి వెళ్ళి, పవిత్ర నదీ జలాలను తెచ్చి, స్థానిక నాలయాలైన శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీ సమేత నారసింహ, శ్రీవేంకటే శ్వర, వేణుగోపాల, యమ ధర్మరాజ, ప్రసన్నాంజనేయ, శ్రీరామలింగేశ్వరాల యాలలో ఉదయం ప్రత్యేక అర్చనలు, పూజలు, అభిషేకాలు, కుంకు మార్చనలు, నిత్య కళ్యాణాది కార్యక్రమాలను నిర్వహించగా, అశేష భక్తజనం ప్రత్యేక పూజాదికాలు చేయించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో, సిబ్బంది సహకారంతో, అర్చకులు, వేద పండితులు సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు.




# ఈ.ఎ.పి. సెట్ ఫలితాల్లో 2009 వ ర్యాంకు సాధించిన 'సరిగల్ల శ్రీయ'

**అభినందించిన మున్సిపల్ చైర్మన్ అడు వాల జ్యోతి-లక్ష్మణ్**

**జగిత్యాల మే 23 (ప్రజామంటలు):**
ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఈ.ఎ.పి. సెట్ ఫలితాల్లో జగిత్యాల పట్టణంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ బై.పి.సి. పూర్తి చేసిన సరిగల్ల శ్రీయ 2009 వ ర్యాంకు సాధించిన సందర్భంగా జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువల జ్యోతి లక్ష్మణ్ పుష్పగుచ్చం అందించి విద్యార్థినీ అభినందించారు. మున్సిపల్ చైర్పర్సన్ నివాసంలో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మర్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడతూ ..ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఒక కోణంలో ప్రతిభ దాగి ఉంటుందన్నారు. ఆయా ప్రతిభను గుర్తించి వారిని ఆ మార్గంలో రాణించేలా ప్రోత్సహాన్ని ఇవ్వడం ప్రతి ఒక్కరి భాద్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్ కుమార్, పాల్గొన్నారు.




## వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేరుతో ఫేక్ మెసేజ్‌లు




**హనుమకొండ మే 23 (ప్రజామంటలు):**
వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించి తద్వారా పలువురి నుంచి డబ్బు వసూలు చేసేందుకు సైబర్ నేరగాళ్లు యత్నిస్తున్నారు. కలెక్టర్ ప్రావీణ్య మీటింగ్ లో ఉన్నానని, అర్జెంట్ డబ్బులు కావాలంటూ 094776414080 శ్రీలంక నంబర్ నుంచి ఆ సందేశం పంపిన సైబర్ నేరగాడు డబ్బులు ఫోన్‌పే చేసి, స్క్రీన్‌షాట్ షేర్ చేయాలని కోరాడు. ఇప్పటికే పలువురికి మేసేజ్‌లు పంపించారు. ఈ విషయం కలెక్టర్ ప్రావీణ్య దృష్టికి రావడంతో తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెన్వెంటనే తన అసలు ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరూ డబ్బులు అడిగిన ఇవ్వొద్దని కలెక్టర్ సూచించారు. సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**హుస్నాబాద్ డివిజన్ ప్రెస్ క్లబ్ అనుబంధ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో..**

# పాత్రికేయ నూతన అడ్హాక్ కమిటీ ఎన్నిక

**చిగురుమామిడి మే 23 (ప్రజా మంటలు):**
చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో (టియు డబ్ల్యూజే) (ఐజేయు) సభ్యుల పాత్రికేయుల సమావేశ ాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాత్రికే యులకు సంబంధించిన సమస్యలతో పాటు నివేశన స్థలాల సాధన, సంఘం బలోపేతం దృష్టి, సంస్థగత నిర్మాణంపై కులం కుశంగా చర్చించారు. అనం తరం మండల నూతన అడ్హాక్ కమిటీని టియుడబ్ల్యూజే ఐజే యు జిల్లా నాయకుడు, హుస్నా బాద్ డివిజన్ ప్రెస్ క్లబ్ అనుబంధ సంఘం సీనియర్ సభ్యుడు జేరుపోతుల వెంకటస్వామి (ఆంధ్రజ్యోతి), మార్త ప్రకాష్ (నమస్తే తెలంగాణ) హుస్నాబాద్ ప్రెస్ క్లబ్ ఉపా ధ్యక్షులు, ఎండి రఫీ (చురకలు దినపత్రిక) హుస్నాబాద్ ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శిల ఆధ్వర్యంలో అడ్హక్ మండల కన్వీనర్ గా పత్తెం రమేష్ (మన తెలంగాణ), మండల కో కన్వీనర్ గా గాదె రఘునాథ్ రెడ్డి(ఆంధ్రప్రభ),సభ్యులుగా బొల్లుమల్ల రాజమౌళి (ప్రజాపక్షం), శేషం నరసింహచార్యులు (మనం), జేరిపో తుల సదానందం (సూర్య) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత్రికే యులకు సంబంధించిన పలు అంశా లపై సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మా నం చేశారు. ఈ కార్యక్రమంలో పత్తెం శ్రీనివాస్ (మన తెలంగాణ), ముడికే కనకయ్య (తెలంగాణ రిపోర్టర్), ఎనగందుల అశోక్ (విజన్ ఆంధ్ర), భోజ నపెల్లి సాయి చరణ్ (గ్రామ దండోరా), బుల్లి రంజిత్ కుమా ర్ (విశాల భారతి), బొల్లి శ్రీనివాస్ (వాయిస్ టుడే), సొన్నాయిల భరత్ (ప్రజామం టలు), బండారి అజెయ్ (వాయిస్ న్యూస్), గడ్డం అనిల్ కుమార్(ది క్రైమ్ న్యూస్)లు పాల్గొన్నారు.





## ఘనంగా పోచమ్మ తీర్థాలు



**జగిత్యాల మే 23 (ప్రజామంటలు):**
జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామంలో గురువారం మాల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ తీర్థాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుల్లతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులో గల పోచమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. మాల సంఘ కుల సభ్యులు, మహిళలు, యువత ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పన్న పేట మాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వేణుగోపాల స్వామి తులాభారం, పూలంగిసేవ,సహస్ర దీపాలంకరణ వేడుకలు

**జగిత్యాల మే 23( ప్రజా మంటలు)**



జగిత్యాల పట్టణంలోని బ్రాహ్మణ వీధి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం అఖిలాండకోటి బ్రహ్మండ నాయకుడు శ్రీ వేణుగోలస్వామి కి పూలంగి సేవ, తులాభారంతో పాటు ఆలయ ఆవరణ అంతా సహస్ర దీపాలంకరణను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం సామూహిక నవగ్రహ ఆరాధన, హెూమము, నిర్వహించారు వైదిక క్రతువులు యజ్ఞాచారి దెబ్బడ వంశీధరాచారి, జీయర్ స్వామి శిష్య బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు ఆశీర్వచనము చేశారు. తులాభారం సందర్భంగా నంబి సత్యనారా యనా చారి తులాభారపద్యాలను పఠించారు. నంబి వేణుగోపాల ఆచార్య బ్రహ్మోత్సవ వేడుకల లో నిర్వహించిన వివిధ కార్యక్రమాల ప్రాశస్త్యాన్ని తెలియజేశారు.

# తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపిద్దాం

**తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్**



**భీమదేవరపల్లి మే 23 (ప్రజామంటలు):**
నిరుద్యోగ, ఉద్యోగ సమస్యలపై నిత్యం ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను ఈ నెల 27 న, జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ొ%. తెలంగాణలో పదేళ్లపాటు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేసిందని అన్నారు. కేంద్రంలో బిజెపి సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్, మోడీ లు కాదా అని ప్రశ్నించారు. అదేవిధంగా మెగా డీఎస్సీ వేస్తానని చెప్పిన కెసిఆర్ గ్రూప్ 1, 2 పరీక్షలు పేపర్ లీకేజీ చేసి, టీఎస్పీఎస్సీ ద్వారా ఉద్యోగాలను అమ్ముకున్నది బిఆర్ఎస్ పార్టీ, బిజెపి ప్రభుత్వంలో ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేసి నిరుద్యోగ వ్యవస్థను పెంచింది. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ, నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ ను, మెగా డీఎస్సీ ఉద్యోగాలు ప్రకటన చేసి నిరుద్యోగులను ఆదుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల శాసన మండలికి ప్రజల పక్షాన పోరాడే తీన్మార్ మల్లన్న ను భారీ మెజార్టీతో గెలిపించి చట్టసభల్లో పంపాలని విజ్ఞప్తి చేశారు.



జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి హరీష్ రావు. వెంట పాల్గొన్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

## ధర్మపురిలో స్వామి వారి దర్శనానికి బారులు భక్తులు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 23 (ప్రజామంటలు):** వైశాఖ శుద్ధ పౌర్ణమి సెలవు దినములు ఉండుట చేత పవిత్ర పుణ్యక్షేత్రం ధర్మపురి లో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ముందుగా గోదావరి నదిలో స్నానం ఆచరించి తదుపరి స్థానిక దైవమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని అలాగే అనుభంద దేవాలయములలో గల శ్రీస్వామి వార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

## వడదెబ్బకు పశువుల కాపరి 'ఐలయ్య' మృతి




**ఎల్కతుర్తి మే 23 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామంలో పశువుల కాపరిగొర్రె ఐలయ్య సన్నాఫ్ భూమయ్య పశువుల కాపరి రోజువారిగా పశువులను మేతకు తీసుకెళ్లి తిరిగి వస్తుండగా వడదెబ్బ తలగడంతో వెంటనే ఆసుపత్రికి వెళ్ళాడు. డాక్టర్లు కూడా వడదెబ్బ తగిలిందని చాలా రెస్ట్ తీసుకోవాలని చెప్పడం జరిగింది. రాత్రి 12 గంటలకు వడదెబ్బతో మృతి చెందాడు. కావున ఈ పేద కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆ గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు, సిపిఐ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి, ఆదుకోవాలని కోరారు.

## పార్వతీ బరాజ్‌ను సందర్శించిన కేంద్ర బృందం

**పెద్దపల్లి,మే23:** పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల పార్వతీ బరాజ్‌ను గురువారం సీడబ్ల్యూపీఆర్ఎస్(సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్) బృందం సభ్యులు సందర్శించారు. పుణెలి నుంచి వచ్చిన టీం సభ్యులు స్థానిక ఇంజినీరింగ్ అధికారులతో కలసి బరాజ్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బరాజ్ డౌన్ స్ట్రీమ్‌ను, బరాజ్‌లోని పియర్ 60వ గేటును క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు గంట పాటు ప్రాజెక్టులో కలియతిరిగారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న సందర్భంలో స్థానిక ఇంజినీరింగ్ అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్వతీ బరాజ్ సందర్శనలో బృందం సభ్యులు జేఎన్ ఎడ్లబద్కర్, డాక్టర్ ప్రకాశ్ కే పాలే, డాక్టర్ డీజీ నాయుడుతో పాటు స్థానిక ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

## రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి



**బాపట్ల,మే23:** బాపట్ల జిల్లాలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలైన ఘటన వేటపాలెం మండలం పందిళ్లపల్లి బైపాస్ రోడ్డులో జరిగింది. వేటపాలెం పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల వైపు నుంచి కనిగిరి వెళ్తోన్న కారు అదుపుతప్పి పందిళ్లపల్లి నుంచి చీరాల వైపు వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన శిరీష(29) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త టెండూల్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో కారులో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలవ్వడంతో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రచారం

**ఖమ్మం,మే23:** ఉమ్మడి నల్గొండ, ఖమ్మం,వరంగల్ జిల్లాల పరిధిలో పట్టభద్రుల భారాస ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుముల రాకేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ... ఇల్లందులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారాస వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ ఆధ్వర్యంలో ఇల్లందు కోరగుట్ట నేచర్ పార్క్, సింగరేణి పాఠశాల క్రీడా మైదానం ప్రాంతాల్లో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి మాట్లాడారు.

# మాచర్ల ఘటనపై తొలగని ఉత్కంఠ

### - బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన పిన్నెల్లి - నరసరావుపేటలో కొనసాగుతున్న గస్తీ

**అమరావతి,మే23:** మాచర్ల ఘటనపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా మాచర్లలోని పోలింగ్ కేంద్రంలో దూరి ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఏ1గా చేర్చారు. ఆయన గత కొన్ని రోజులుగా అందుబాటులో లేకపోవడంతో ఆయన కోసం ఏపీ, తెలంగాణ పోలీసులు గాలిస్తున్నారు. ఆయన్ను అరెస్టు చేసేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో రామకృష్ణారెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. అంతకుముందు నర్సరావు పేట కోర్టులో లొంగిపోతారన్న ప్రచారం జోరుగా సాగింది. పోలీసులు పెద్ద మొత్తంలో కోర్టుకు చేరుకున్నారు. విచారణకు పిన్నెల్లి వస్తే అరెస్ట్ చేసేందుకు యత్నిస్తున్నారు. కాగా.. మాచర్ల ఈవీఎం ధ్వంసం ఘటనపై సీరియస్ అయిన సీఈసీ.. ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లిని అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అరెస్టుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఆయనను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌కు వెళ్లాయి. పల్నాడు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఈ బృందాలను ఏర్పాటు చేశారు. ఏపీ పోలీసులు, తెలంగాణ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కంది వద్ద పిన్నెల్లి కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు.. అందులోని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం మూడు చట్టాల పరిధిలో పది సెక్షన్లతో పిన్నెల్లి మీద కేసులు నమోదు చేశారు. ఐపీసీ, ఆర్పీ, పీడీపీపీ చట్టాల పరిధిలో సెక్షన్ల నమోదు చేశారు పోలీసులు. విటన్నింటి నేపథ్యంలో ఆయన తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని హై కోర్టును ఆక్రయించారు. ఇదిలావుంటే రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులో పిన్నెల్లి ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఆయన కోసం ఇప్పటికే ఎస్పీ, డీఎస్పీ ఆధ్వర్యంలో 8 ప్రత్యేక



బృందాలు గాలిస్తున్నాయి. విదేశాలకు పారిపోకుండా ఇప్పటికే లుకౌట్ నోటీసులు కూడా జారీ చేసిన విషయం తెలిసిదే. ఇదిలా ఉండగా నరసరావుపేట కోర్టులో పిన్నెల్లి స్వయంగా లొంగిపోనున్నట్లు వచ్చిన సమాచారం మేరకు 1వ పట్టణ సిఐ సిహెచ్. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నరసరావుపేట కోర్టు వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టుకు వచ్చి లొంగిపోతారన్న సమాచారం పట్ల స్పష్టత లేదని శాంతిభద్రతల దృష్ట్యా కోర్టు వద్ద ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశామని సిఐ పేర్కొన్నారు.

## దేశీయ స్టాక్ మార్కెట్లు కొత్త రికార్డులు

### గరిష్టస్థాయికి చేరుకున్న సూచీలు

**ముంబై,మే23:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కొత్త రికార్డులను నెలకొల్పాయి. ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సూచీలు ఆ తర్వాత దూసుకుపోయాయి. ఈ క్రమంలో సెన్సెక్స్, నిఫ్టీ జీవనకాల గరిష్ఠాలను తాకాయి. అదే సమయంలో సెన్సెక్స్ తొలిసారిగా 74,253 పాయింట్లు, నిఫ్టీ 22,950 పాయింట్ల ఎగువన ముగిశాయి. కేంద్రానికి అంచనాలకు మించి రిజర్వ్ బ్యాంక్ డివిడెండ్ ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గతంలో ఎన్నడూ లేని విధంగా 2.11లక్షల కోట్లను చెల్లించేందుకు ఆమోదముద్ర వేసింది. దాంతో సూచీలు పరుగులు తీశాయని.. అదే సమయంలో ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలకు దిగుతూ వస్తున్నారు. తాజాగా దేశీయ మదుపరులతో పోలిస్తే మళ్లీ వారే కొనుగోళ్లకు కారణమని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు హెచ్ఎస్‌బీసీ వెలువరించిన డేటా సైతం సూచీల పరుగుకు మరో కారణమని పేర్కొంటున్నారు. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 74,253. 53 పాయింట్ల వద్ద ఎ÷-లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే సెన్సెక్స్ దూసుకెళ్లింది. ఇంట్రాడేలో 75,499.91 పాయింట్లకు పెరిగి.. జీవకాల గరిష్ఠానికి చేరుకున్నది. చివరకు 1,196.98 పాయింట్ల లాభంతో 75,418.04 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఆల్‌టైమ్ హైకి చేరుకోవడంతో పాటు రికార్డు స్థాయిలో ముగిసింది. చివరకు 369.85 పాయింట్లు పెరిగి.. 22,967.65 వద్ద స్థిరపడింది. దాదాపు 1577 షేర్లు పురోగమించగా.. 1761 షేర్లు క్షీణించాయి. నిఫ్టీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఎంఅండ్ఎం, యాక్సిస్ బ్యాంక్, ఐచర్ మోటార్స్ లాభాల్లో ముగిశాయి. సన్ ఫార్మా, పవర్ గ్రిడ్ కార్ప్, హిండాల్కో, కోల్ ఇండియా, ఎన్టీపీసీ, టాటా కన్స్యూమర్ ప్రోడక్ట్స్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం పెరిగాయి. మెటల్, ఫార్మా మినహా, ఇతర అన్ని రంగాల సూచీలు ఆటో, బ్యాంక్ క్యాపిటల్ గూడ్స్ 2శాతం చొప్పున పెరిగాయి.

## పదవి నుంచి సిఎస్ వెంటనే తప్పుకోవాలి

### - కేంద్రం పర్యవేక్షణలో కౌంటింగ్ జరగాలి - టిడిపి నేత దేవినేని ఉమ డిమాండ్

**అమరావతి,మే23:** రాష్ట్రంలో అధికారుల తీరుపై మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్ర విమర్శలు చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వ్యవహారంపై అధికారులు వ్యవహరించిన తీరుపై ఆయన మండిపడ్డారు. వైసీపీకి వంతపాడటమే జవహర్ రెడ్డి పనిగా మారిందని విమర్శించారు. ఇదే విషయమైన గురువారం నాడు మీడియాతో మాట్లాడారు దేవినేని ఉమ. 13వ తేదీన మధ్యాహ్నం స్వయంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలు పగలగొట్టాడని ఆరోపించారు. వందశాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ జరిగిందని.. ఆ కారణంగానే పిన్నెల్లి వ్యవహారం బయటపడిందన్నారు. అయితే, 15వ తేదీన వీఆర్వో పెట్టిన కేసులో పిన్నెల్లి పేరు లేదన్నారు. చీఫ్ సెక్రెటరీ జవహర్ రెడ్డి నాయకత్వంలో పోలింగ్ అధికారులను నియమించారని.. 20వ తేదీన సిట్ పర్యవేక్షణలో జరిగిన విచారణ కోర్టులో వేసిన మెమోలో ఈ వాస్తవాలు అన్నీ బయటకొచ్చాయన్నారు. 10సెక్షన్లతో కేసు నమోదు చేసామని సీఈఓ చెబితే.. ఇంకా సిగ్గు లేకుండా మంత్రి అంబటి, కాసు మహేష్ రెడ్డి వీటిని తప్పుబడుతున్నారని దేవినేని ÷ర్ అయ్యారు.సీఈఓ చేసిన ప్రకటనను తప్పుదోవ పట్టించే విధంగా వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారంటే.. కౌంటింగ్ ప్రక్రియను సక్రమంగా జరగనిస్తారా? అని దేవినేని ప్రశ్నించారు. రాయలసీమ జిల్లాలో చాలా ప్రాంతాల్లో రిటర్నింగ్ ఆఫీసర్లను వైసీపీ శ్రేణులు బెదిరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. 'పోలింగ్ నాడు సహకరించలేదు.. కౌంటింగ్ నాడు మీ సంగతి చూస్తామంటూ వాళ్ల కుటుంబ సభ్యులను వైసీపీ నాయకులు, కార్యకర్తలు బూతులు తిడుతూ బెదిరిస్తున్నారు' అని అధికారులు వాపోతున్నారన్నారు. ఇంత జరుగుతుంటే.. చీఫ్ సెక్రటరీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. 'మీ పరిధిలో మీ ఆధ్వర్యంలో పనిచేసే సిబ్బందికే ఈ రాష్ట్రంలో రక్షణ లేకపోతే చీఫ్ సెక్రటరీ ఈ పదవిలో ఉండటానికి అర్హత లేదు. నైతిక బాధ్యత వహించి తప్పుకోవాలి' అని దేవినేని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఎలక్షన్ కమిషన్ వెంటనే స్పందించాలని, కేంద్ర ఎన్నికల పర్యవేక్షణ అధికారుల ఆధ్వర్యంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగితేనే రిటర్నింగ్ అధికారులకు రక్షణ ఉంటుందని దేవినేని అన్నారు. సినిమా ఫక్కిలో ఎమ్మెల్యే అనుచరులు బ్లూమీడియా ఛానల్స్‌లో ప్రచారం చేశారని.. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని ధనుంజయ్ రెడ్డి తతంగం అంతా చేస్తున్నారని దేవినేని ఆరోపించారు. రఘురామ్ రెడ్డి, సజ్జల, భార్గవ్ రెడ్డి, ఇంటిలిజెన్స్ ఆంజనేయులు పర్యవేక్షణలో కొంతమంది పోలీసులను బెదిరించి ఇటువంటి ఎమ్మెల్యేలకు సహకరిస్తున్నారని విమర్శించారు. పిన్నెల్లి దేశం వదిలిపెట్టి వెళ్లాడా? రాష్ట్రం వదిలి వెళ్లాడా? ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని దేవినేని ప్రశ్నించారు. ప్రజావేదిక విధ్వంసంతో వైఎస్ జగన్ చేసిన అరాచక పాలన ఎమ్మెల్యే ఈవీఎం విధ్వసంతో పరిసమాప్తం అయ్యిందని వ్యాఖ్యానించారు. సాక్షి యాజమాన్యం, పత్రిక, ఛానల్‌పై కేసులు బుక్ చేయాలని దేవినేని ఉమ డిమాండ్ చేశారు. ఎలక్షన్ కమిషన్, సీఈఓ చెప్పిన తరువాత కూడా ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్న వారిని అరెస్ట్ చేసి, కేసులు బుక్ చేయాలన్నారు.

## పోలింగ్ హింసాత్మక ఘటనలకు సిఎస్‌దే బాధ్యత

### వెంటనే సిఎస్ జవహర్ రెడ్డిని తొలగించాలన్న కనకమేడల

**అమరావతి,మే23:** పోలింగ్ రోజు జరిగిన హింసాత్మక ఘటనలకు బాధ్యుడిని చేస్తూ సీఎస్ జవహర్‌రెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలని టిడిపి సీనియర్ నేత కనకమేడల రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. హింసాత్మక ఘటనలపై చర్యలు చేపట్టడంలో సీఎస్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. సీఎస్‌ను తొలగించకపోతే కౌంటింగ్ ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. వైకాపాకు అనుకూలంగా వ్యవహరించే పోలీసులపై ఈసీ విచారణకు ఆదేశించాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలింగ్ రోజు ఘటనల వీడియోలు బయటపెట్టాలన్నారు. హింసాత్మక ఘటనలు జరిగిన అన్ని ప్రదేశాల్లోని వీడియోలను విడుదల చేయాలని తెలిపారు. మాచర్ల ఘటనల నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఎక్కువ శాతం మంది పోలీసులు ఇప్పటికీ వైకాపా తొత్తులుగా ఉన్నారని ఆక్షేపించారు. అలాంటి పోలీసుల సహకారంతోనే పిన్నెల్లి తప్పించుకున్నారన్నారు. ఘటనకు బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వడ్లకు మద్దతు ధరలపై అబద్ధాలు

### - ఇచ్చిన హామీలు అమల్లో వెనుకంజ - కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ విమర్శలు

**భూపాలపల్లి,మే23:** సన్న బియ్యానికే మద్దతు ధర ఇస్తారట.. మన తెలంగాణాలో దొడ్డు బియ్యం ఎక్కువగా పండిస్తామని... పండించిన రైతుల పరిస్థితి ఎంటని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నిం చారు. వడ్లకు బోనస్ అని చెప్పి బోగస్ చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నేత మాజీ మంత్రి హరీష్ రావుకాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గురువారం భూపాలపల్లిలో పర్యటించిన ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి గ్రాడ్యుయేట్ ఎన్నిక జరిగినప్పుడల్లా మనమే గెలిచామని, బిట్స్ పిలానిలో గోల్డ్ మెడలిస్ట్ ఆయన రాకేష్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపి చ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ లు అన్నీ తుస్సుమన్నాయని, కాంగ్రెస్ ప్రచా రంలో 6 గ్యారంటీల్లో ఐదు



అమలు చేసినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారని, జాబ్ క్యాలెండర్ పత్తా లేకుండా పోయిందని హరీష్ రావు విమర్శించారు. ఉపాధ్యాయుల మీద లాఠీ ఛార్జ్ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వా నిదేనని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు పెంచిందని, మహిళా గ్రాడ్యుయేట్‌లు కూడా బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తున్నారన్నారు. మహిళా పథకం కింద వారికి నెలకు రూ. 2,500 ఇస్తాం అని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. నిన్న వరంగల్ ఎంజీఎంలో కరెంట్ పోయిందన్నారు. విద్యుత్ ఉద్యోగులను కూడా ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని హరీష్ రావు పేర్కొన్నారు.

## రైతులకు వేసవిలో భూసార పరీక్షల ఉపయోగంపై అవగాహన



**భీమదేవరపల్లి మే 23 (ప్రజామంటలు):** మండలం కేంద్రం భీమదేవరపల్లి గ్రామంలో గ్రామ రైతులకు డబ్ల్యూ.డబ్ల్యూ.ఎఫ్ - నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ, బి.సి.ఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రామ రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు ఈ వేసవిలో తప్పకుండ భూసార (మట్టి )పరీక్షలు చేయించుకోవాలని, వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని సూచించారు. దీని వల్ల ఎరువుల వినియోగం అవసరం ఉన్నంత వరకే వాడడం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గి, నేల కాలుష్యం తగ్గుతుంది. రైతులు ఈ వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలని, పశువుల పెంటలు, చెరువు మట్టి వేసుకోవాలని, మందలు పెట్టించుకోవాలని అన్నారు. పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ, జనుము, పిల్లిపెసర, నవధాన్యాలు మొదలగునవి చల్లుకోవాలని అన్నారు. పూత దశలో వాటిని కలియ దున్నుకోవడం, పత్తి, మొక్కజొన్న వ్యర్థాలను కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు. భూసార పరీక్షల కొరకు రైతులు తీసుకొని వచ్చిన మట్టిని రైతుల సమక్షంలో పరీక్షలు చేసి రైతులందరికి పరీక్షల ఫలితాలు వెంటనే ఇచ్చి అన్ని వివరాలు తెలియజేశారు. ఆరోగ్యంతో పాటు పర్యావరణం కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సిబ్బంది రమేష్, సాయి కిరణ్, తిరుపతి, జితేందరరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఉచిత భగవద్గీత పఠన శిక్షణ తరగతులు

**జగిత్యాల మే 23 (ప్రజా మంటలు)**




జిల్లా కేంద్రంలోని శ్రీ అయ్యప్ప సేవా సంఘం ట్రస్ట్, గీతా సత్సంగ ట్రస్ట్, గీతా భవన్ జగిత్యాల వారిచే ఉచిత భగవద్గీత పఠన శిక్షణా తరగతులు గురువారం ప్రారంభ మయ్యాయి. ఈ నాటి కార్యక్రమంలో పాంపట్టి రవీందర్, గుడి కందుల వెంకన్న,కోటగిరి శ్రవణ్ కుమార్,కోటగిరి కళ, జిడిగె రాము, బండారి లక్ష్మి నారయణ, దశరథ రెడ్డీ, మార కైలాసం సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# బుజ్జితో ప్రయాణం ఎంతో ఆసక్తికరం


## అమితాబ్, కమల్ సర్‌లతో నటించడం అదృష్టం



బుజ్జితో కలిసి భైరవ చేసిన ప్రయాణం ఎంతో ఆసక్తికరం. ఈ పాత్రలతో మూడేళ్ల ప్రయాణం చేశా' అన్నారు ప్రభాస్.

ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కల్కి 2898 ఎ.డి'. దీపికా పదుకొణె కథానాయిక. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించారు. జూన్ 27న సినిమాని విడుదల చేస్తున్నారు. పురాణాలతో ముడిపడిన సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. ఇందులో భైరవ అనే పాత్రలో కనిపిస్తారు ప్రభాస్. బుజ్జి అనే పేరుతో కూడిన వాహనం కూడా కథలో కీలకం. బుజ్జి, భైరవ పాత్రల్ని పరిచయం చేస్తూ బుధవారం రాత్రి రామోజీ ఫిల్మ్‌సిటీలో ఓ వేడుకని నిర్వహించారు. బుజ్జి వాహనాన్ని నడుపుకుంటూ వేదిక మధ్యలోకి వచ్చి అభిమానుల్ని అలరించారు ప్రభాస్. ఇదే వేడుకలో 'బుజ్జి – భైరవ' టీజర్‌నీ ప్రదర్శించారు. 'ఇంక తిరిగి వెళ్లేదే లేదు...' అంటూ ప్రభాస్ చేసిన సందడి టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. అనంతరం వేడుకలో ప్రభాస్ మాట్లాడుతూ 'అమితాబ్... కమల్ హాసన్ నటనని చూసి భారతదేశం స్ఫూర్తి పొందింది. అలాంటి గొప్ప నటులతో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం. అమితాబ్ బచ్చన్‌లాంటి నటుడు మన దేశంలో ఉన్నందుకు గర్వపడుతున్నా. ఆయన స్ఫూర్తితోనే వచ్చాం మేమంతా. నా చిన్నప్పుడు కమల్‌హాసన్ సర్ నటించిన 'సాగరసంగమం' చూసి అలాంటి దుస్తులు కావాలని మా అమ్మని అడిగి తెప్పించుకున్నా. ఇందులో ఉన్న మరో అందమైన స్టార్ దీపికా పదుకొణె. ఆమెతో కలిసి పనిచేయడం మంచి అనుభవం. దిశా పటానీని హాట్ స్టార్ అంటుంటారు మా నిర్మాత స్వప్నదత్. నిర్మాత అశ్వనీదత్ ఈ వయసులోనూ శ్రమించే విధానం చూసి ఎంతో నేర్చుకోవాలనిపిస్తుంది. ఇంత ఖరీదైన సినిమా తీస్తూ కూడా, ఇంకా ఏం చేద్దాం అని అడుగుతుంటారు. ఇంత భారీ సినిమాలు తీస్తూ, ఇన్నేళ్లు పరిశ్రమలో ఉన్నది ఆయనొక్కరేనేమో. తన రెండో సినిమానే ఎన్టీఆర్‌తో చేశారంటే ఆయన స్థాయి ఏమిటో అర్థమవుతుంది. అంతే ధైర్యం, తపనతో పనిచేస్తుంటారు ఆయన కుమార్తెలు స్వప్న, ప్రియాంక. వాళ్లకీ, బుజ్జిని పరిచయం చేస్తున్న దర్శకుడు నాగ్ అశ్విన్‌కి కృతజ్ఞతలు. ఈ సినిమా కోసం నేనూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా అన్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'పేరు చిన్నదే కానీ, సినిమాలో బుజ్జి మామూలుగా ఉండదు. సినిమా తీయడమే కష్టం, ఈ సినిమా కోసం ఇంజినీరింగ్ కూడా చేయాల్సి వచ్చింది. భవిష్యత్తు కారు నేపథ్యంలో సినిమా అన్నప్పుడు డిజైన్ గురించి తర్జన భర్జన పడ్డాం. మహీంద్ర గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాకు ట్వీట్ చేశాక, ఆయన తన బృందాన్ని మాకు పరిచయం చేశారు. వాళ్లంతా చాలా సహకారం అందించారన్నారు. నిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ 'ఇది విడుదల తర్వాత చాలా పెద్ద సినిమా అవుతుంది అన్నారు.

# కాజల్ సత్యభామ సినిమా జూన్ 7కు వాయిదా



మే 31న సుమారు అరడజనుకు పైగా సినిమాలు విడుదలవుతాయయనుకుంటున్న సమయంలో అందులో ఒక్కో సినిమా వాయిదా పడుతూ వస్తోంది. సుధీర్ బాబు నటించిన 'హరోం హర' మే 31న విడుదల కావాల్సి వుంది, కానీ ఇప్పుడు ఆ సినిమా జూన్ 14న విడుదలవుతుంది. ఇప్పుడు ఇంకో సినిమా కూడా విడుదల వాయిదా వేశారు. కాజల్ అగర్వాల్ పోలీసు పాత్రలో నటించిన 'సత్యభామ' సినిమా కూడా విడుదల వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ జూన్ 7 అని అధికారికంగా ప్రకటించారు. మే 31న ఎక్కువ సినిమాలు విడుదలకి ఉండటంతో, అందరితోపాటుగా ఎందుకు పోటీ అని జూన్ 7 కి ఈ 'సత్యభామ' ని వాయిదా వేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ సినిమా ప్రీ విడుదల వేడుక మాత్రం యధావిధిగా జరుగుతుందని చెపుతున్నారు. నందమూరి బాలకృష్ణ ప్రత్యేక అతిధిగా వచ్చి ఈ సినిమా ప్రీ విడుదల వేడుకలో పాల్గొంటారని చెప్పారు. 'భగవంత్ కేసరి' సినిమా విజయం తరువాత కాజల్ అగర్వాల్ చేస్తున్న సినిమా ఈ 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకుడు, నవీన్ చంద్ర ఒక ముఖ్యమైన పాత్రలో కనపడనున్నాడని తెలుస్తోంది. కాజల్ అగర్వాల్ ఇందులో ఒక పవర్ ఫుల్ పోలీసు పాత్రలో నటించింది. ఈ చిత్ర ప్రచారాలు విరివిగానే చేస్తున్నారు, కాజల్ ఈ సినిమాని తన వ్యక్తిగతంగా తీసుకొని మరీ ప్రచారాలు చేస్తున్నట్టుగా వినికిడి. 'మేజర్' లాంటి అద్భుతమైన సినిమాకి దర్శకత్వం వహించిన, శశికిరణ్ తిక్క ఈ సినిమాకి సమర్పకుడు, అలాగే కథనం కూడా అందిస్తున్నారు.

# లవ్‌మీ సినిమాతో వస్తున్న వైష్ణవి చైతన్య




విమర్శకుల ప్రశంసలే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో యువతని కూడా ఇట్టే ఆకర్షించిన నటి వైష్ణవి చైతన్య. ఇప్పుడు 'లవ్ మీ' సినిమాకి ప్రత్యేక ఆకర్షణ వైష్ణవి చైతన్య అని మాత్రమే చెప్పాలి అని అంటున్నారు.'మే 25న విడుదలవబోతున్న 'లవ్ మీ' సినిమాలో అందరి దృష్టి ఇప్పుడు వైష్ణవిపైనే ఉన్నాయని తెలుస్తోంది. 'బేబీ' సినిమాతో ఒక సంచలనం సృష్టించిన వైష్ణవి, 'లవ్ మీ' లో ఎలాంటి పాత్ర చేస్తోంది, ఆమె ప్రతిభని తెలుగు ప్రేక్షకులకి మరోసారి చూపించే దిశగా ఆ పాత్ర ఉంటుందా అనే ఆసక్తితో ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో కథానాయకురాలిగా నటించటంతో


ఈమధ్య కాలంలో ఒక తెలుగమ్మాయికి మంచి పేరు వచ్చిందంటే ఆ అమ్మాయి ఒక్క వైష్ణవి చైతన్య అనే చెప్పాలి. 'అల వైకుంఠపురంలో' అల్లు అర్జున్‌కి చెల్లెలుగా నటించి 'వాళ్ళు నా చున్నీ ఎత్తుకెళ్లి పోయారురా' అంటూ అల్లు అర్జున్ తో అన్న ఆ సన్నివేశం అందరికీ గుర్తుంది. అదే వైష్ణవి చైతన్య గురించి అదే అల్లు అర్జున్ 'బేబీ' సినిమా విజయోత్సవ సభలో ఎంత గొప్పగా చెప్పారో కూడా అందరికీ తెలిసిన విషయమే. వైష్ణవి చైతన్య 'బేబీ' అనే సినిమాతో తెలుగు పరిశ్రమలో ఒక ప్రకంపనలు సృష్టించింది. ఎక్కడినుండో వచ్చి తెలుగురాని కథానాయికలు ఏలుతున్న ఈ సమయంలో అవకాశం ఇస్తే తెలుగు అమ్మాయి ఎంత చక్కటి ప్రతిభను కనబరుస్తుందో చేసి చూపించింది వైష్ణవి. 'బేబీ' సినిమాతో పాటు, ఒక పాట కూడా పాడింది వైష్ణవి. లెజండరీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఈ సినిమాకి సంగీతం సమకూరిస్తే, అయన సంగీత దర్శకత్వంలో వైష్ణవి పాట పాడటం ఇంకొక ఆసక్తికరమైన విషయం. ఈ సినిమాకి దర్శకుడు అరుణ్ భీమవరపు, ఛాయాగ్రహణం దేశంలో అత్యంత ప్రతిభావంతుడైన పీసీ శ్రీరామ్. ఇంతమంది పెద్ద పెద్ద సాంకేతిక నిపుణలతో పనిచేసే అవకాశం తన కెరీర్ ఆరంభంలోనే వైష్ణవికి రావటం నిజంగా ఆమె ప్రతిభకి తార్కాణం. ఆశిష్ రెడ్డి ఈ సినిమాలో కథానాయకుడు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

# దేవర ఫియర్ సాంగ్‌కు 50 మిలియన్లకుపైగా వ్యూస్




జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ దేవర చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. పాన్ ఇండియా స్థాయిలో వస్తోన్న ఈ మూవీ రెండు భాగాలుగా విడుదల కానుండగా.. దేవర పార్టు 1 అక్టోబర్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా దేవర నుంచి ఇటీవలే ఫియర్ సాంగ్ ను లాంఛ్ చేశారు. అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన ఈ పాట నెట్టింట గూస్‌బంప్స్ తెప్పిస్తోంది.ఫియర్ సాంగ్ యూట్యూబ్‌లో ఇప్పటిరకు 50 మిలియన్లకుపైగా వ్యూస్‌తో టాప్ వన్ ప్లేస్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఫిషింగ్ హార్బర్ విలేజ్, పోర్ట్ మాఫియా నేపథ్యంలో వస్తోన్న దేవర గ్లింప్స్ ఇప్పటికే నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ భామకు దేవర తెలుగు డెబ్యూ ప్రాజెక్ట్. దేవర పార్టు 1 డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. కాగా మేకర్స్ చాలా రోజుల క్రితం లాంఛ్ చేసిన దేవర ఒరిజినల్ సౌండ్ ట్రాక్ స్టన్నింగ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సెగలు పుట్టిస్తోంది. దేవరలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తుండగా.. ప్రకాశ్ రాజ్, ÷న్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ఇతర కీ రోల్స్ పోషిస్తున్నారు. మల్టీ లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

# దినేశ్ కార్తీక్ జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తి దాయకం



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) వెటరన్ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ ఐపీఎల్‌కు వీడ్కోలు పలికాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌తో రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. ఈ సీజన్ ముందే తన నిర్ణయాన్ని వెల్లడించిన దినేశ్ కార్తీక్.. ఐపీఎల్‌లో ఆర్‌సీబీతో పాటు కేకేఆర్, ముంబై ఇండియన్స్, గుజరాత్ లయన్స్ జట్లకు ప్రాతినిథ్యం వహించాడు. మొత్తం 257 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన దినేశ్ కార్తీక్ 26.32 సగటు, 135 స్ట్రైక్‌రేటుతో 4,842 పరుగులు చేశాడు. ఇందులో 22 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఆర్‌సీబీ తరఫున 162 స్ట్రైక్‌రేటుతో 937 పరుగులు చేశాడు. ఫినిషర్‌గా సత్తా చాటిన డీకే 82 ఫోర్లు, 53 సిక్సర్లు సాధించాడు. ఇక దినేశ్ కార్తీక్ జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తి దాయకం అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దినేశ్ కార్తీక్ రీఎంట్రీ ఇచ్చినట్లు ప్రపంచంలో మరే క్రికెటర్ కూడా కమ్ బ్యాక్ ఇవ్వలేదు. ధోనీ రాకతో టీమిండియా అవకాశాలు సన్నగిల్లగా.. వ్యక్తిగత జీవితంలో కట్టుకున్న భార్య, ప్రాణ స్నేహితుడు దారుణంగా మోసం చేశారు. దాంతో అతను పిచ్చోడిలా మారిపోయాడు. అయితే దీపిక్ పల్లికల్ అందించిన ప్రేమ అతన్న బౌన్స్ బ్యాక్ అయ్యేలా చేసింది. దినేశ్ కార్తీక్ టీమిండియా సెకండ్ వికెట్ కీపర్‌గా తమిళనాడు కెప్టెన్‌గా అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న టైమ్‌లో అతని టీమ్‌మేట్ మురళీ విజయ్.. కార్తీక్ మొదటి భార్యతో ఎఫైర్ పెట్టుకున్నాడు. ఈ విషయం కార్తీక్‌కు తప్పా తమిళనాడు టీమ్ మొత్తానికి తెలుసు. ఒకరోజు అతని మొదటి భార్య ఈ విషయాన్ని కార్తీక్‌కు తెలియజేసింది. మురళీ విజయ్ కారణంగా గర్భం దాల్చినట్లు చెప్పి విడాకులు ఇవ్వాలని కోరింది. విడాకులు తీసుకున్న ఆమె మురళీ విజయ్‌తో సహజీవనం మొదలుపెట్టింది. ఆ టైమ్‌లో విజయ్.. సీఎస్‌కే, టీమిండియా ఓపెనర్‌గా రాణిస్తున్నాడు. ఈ ఊహించని పరిణామంతో దినేశ్ కార్తీక్ డిప్రెషన్‌కు లోనయ్యాడు. అతని ప్రదర్శన కూడా దెబ్బతిన్నది. టీమిండియాలో చోటుతో పాటు తమిళనాడు కెప్టెన్సీ బాధ్యతలను కోల్పోయాడు. ఐపీఎల్‌లోనూ దారుణంగా విఫలమయ్యాడు. ఈ బాధలను భరించలేక ఆత్మహత్యాయత్నం చేశాడు. జిమ్‌కు వెళ్లడం మానేసాడు. ఈ విషయం తెలుసుకున్న దినేశ్ కార్తీక్ ట్రైనర్.. అతని ఇంటికెళ్లి వ్యక్తిగతంగా కలిసాడు. జీవితంపై ఆశలు పెంచి మళ్లీ ట్రైనింగ్ మొదలుపెట్టేలా చేసాడు. ట్రైనర్ సూచనలతో మళ్లీ జిమ్ చేయడం మొదలుపెట్టిన దినేశ్ కార్తీక్‌కు అక్కడే ట్రైనింగ్ తీసుకుంటున్న భారత స్క్వాష్ ప్లేయర్ దీపికా పల్లికల్ పరిచయమైంది. దినేశ్ కార్తీక్ కథను తెలుసుకొని పల్లికల్ చలించిపోయింది. ట్రైనర్‌తో కలిసి అతనికి కౌన్సిలింగ్ ఇవ్వడం మొదలుపెట్టింది. పల్లికల్ పరిచయం కార్తీక్ జీవితానికి ఊపిరి అయింది. దినేశ్ కార్తీక్‌ను దీపికా ఎంకరేజ్ చేయడంతో నెట్స్‌లో తీవ్రంగా శ్రమించిన అతను.. డొమెస్టిక్ మ్యాచ్‌ల్లో సత్తా చాటాడు. భారత జట్టుకు ఎంపికవ్వడంతో పాటు కేకేఆర్ కెప్టెన్సీ అందుకున్నాడు. దీపికా పల్లికల్‌ను పెళ్లి చేసుకున్న కొన్నాళ్లకు టీమిండియాలో అతని స్థానాన్ని రిషభ్ పంత్ భర్తీ చేసాడు. మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. 34 ఏళ్ల వయసులో అతని కెరీర్ చివరి దశకు చేరిందని భావించిన కార్తీక్.. కేకేఆర్ కెప్టెన్సీ వదిలేసాడు. రిటైర్మెంట్ ప్రకటించి కేవలం ఐపీఎల్ మాత్రమే ఆడాలనుకున్నాడు. కానీ పల్లికల్ అప్పటికే గర్భవతి. మధ్యలో కామెంటేటర్‌గా అవతారమెత్తాడు. ఈ జంటకు కవల పిల్లలు జన్మించారు. దినేశ్ కార్తీక్‌కు సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథ్ నుంచి కాల్ వచ్చింది. ధోనీ వారసుడిగా తీసుకోవాలనుకుంటున్నామని ఆయన కార్తీక్‌కు తెలిపాడు. అయితే వేలంలో అనూహ్యంగా చెన్నైతో పోటీపడ్డ ఆర్‌సీబీ కార్తీక్‌ను సొంతం చేసుకుంది. ఐపీఎల్ 2022 సీజన్‌లో కార్తీక్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ఫినిషర్‌గా కార్తీక్ 2.%శీ%ను తలపించాడు. ఈ ప్రదర్శనతో టీమిండియాలోకి రీఎంట్రీ ఇచ్చిన టీ20 ప్రపంచకప్ 2022 ఆడాడు. గత సీజన్‌లో కార్తీక్ విఫలమైనా ఈ సీజన్‌లో సత్తా చాటాడు.

# ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సత్తా చాటడం కీలకం



ఐపీఎల్ 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. చెన్నైలోని చెపాక్ మైదానం వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగే క్వాలిఫయర్–2లో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టే ఆదివారం కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. దాంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ఓవైపు కేకేఆర్‌తో క్వాలిఫయర్–1లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి పాలవ్వగా.. మరోవైపు రాజస్థాన్ రాయల్స్.. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆర్‌సీబీని ఓడించి రెట్టించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. అంతేకాకుండా స్పిన్‌కు అనుకూలంగా ఉండే చెపాక్ మైదానానికి తగ్గట్లుగా రాజస్థాన్ రాయల్స్‌లో అద్భుత స్పిన్నర్లు ఉన్నారు. లోకల్ భాయ్ అశ్విన్‌తో పాటు యుజ్వేంద్ర చాహల్‌ను ఎదుర్కోవడం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు బిగ్ ఛాలెంజ్.ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థాయికి మించిన ప్రదర్శన చేయాలి. ముఖ్యంగా ఆ జట్టు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సత్తా చాటడం కీలకం. సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లలో ఈ ఇద్దరే కీలక పాత్ర పోషించారు. విధ్వంసకర బ్యాటింగ్‌తో రికార్డ్ విజయాలు అందించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ట్రావిస్ హెడ్(533, అభిషేక్ శర్మలే(470) టాప్ స్కోరర్లుగా కొనసాగుతున్నారు. చాహల్, బౌల్ట్, అశ్విన్ వంటి ప్రమాదకర బౌలర్లను ఎదుర్కొని భారీ స్కోర్ చేయాలంటే ఈ ఓపెనింగ్ జోడీ రాణించాల్సిందే. ఈ ఇద్దరితో పాటు హెన్రీచ్ క్లాసెన్(413) సత్తా చాటితే సన్‌రైజర్స్‌కు తిరుగు ఉండదు. రాహుల్ త్రిపాఠి, నితీష్ కుమార్ రెడ్డిలు తమ జోరును కొనసాగించాల్సి ఉంది. నితీష్ కుమార్ రెడ్డి రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 76లి పరుగులతో సత్తా చాటాడు. మరోసారి అతను అదే తరహా ప్రదర్శన కొనసాగిస్తే సన్‌రైజర్స్ బ్యాటింగ్‌కు తిరుగుండదు.సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్‌లో ప్యాట్ కమిన్స్, భువనేశ్వర్ కుమార్, నటరాజన్ రాణిస్తున్నా ఇతర బౌలర్లను నుంచి సహకారం లభించడం లేదు. వానిందు హసరంగా స్థానంలో జట్టులోకి వచ్చిన విజయకాంత్ వియాస్కంత్ అంచనాలను అందుకోలేకపోతున్నాడు. అతని స్థానంలో గ్లేన్ ఫిలిప్స్‌ను తీసుకోవడం ఉత్తమం. సన్వీర్ సింగ్‌కు బదులు జయదేవ్ ఉనాద్కత్‌ను ఆడిస్తే బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ బలం పెరుగుతోంది. పవర్ ప్లేలోనే రాజస్థాన్ రాయల్స్ డేంజరస్ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, సంజూ శాంసన్‌లను ఔట్ చేస్తే మ్యాచ్‌పై పట్టు చిక్కుతుంది. ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉన్న నేపథ్యంలో పకడ్బందీ ప్రణాళికలతో బరిలోకి దిగడం చాలా ముఖ్యం.

## మహిళా పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారం

**- వీడియో తీసి పైశాచికానందం - సోషల్ మీడియాలో ప్రత్యక్షం**
**- కామాంధుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**హైదరాబాద్,మే23:** కామంతో కళ్ళు మూసుకుపోయిన ఓ అధికారి బరితెగించాడు.. ఒళ్ళు మరిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పైగా వీడియో రికార్డు చేసి, వేధింపులకు పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన బల్దియా పరిధిలోని గాజులరామారంలో వెలుగు చూసింది. సర్కిల్‌లో మున్సిపల్ శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిషన్.. తన కింద పని చేసే ఓ పారిశుధ్య కార్మికురాలిపై కన్నేశాడు. తాను చెప్పినట్లు వినాలని ఆమెను బెదిరించాడు. అంతేకాదు విధి నిర్వహణలో ఇబ్బందులు పెట్టాడు. అధికారి వేధింపులు భరించలేక నరకయాతన అనుభవిస్తున్న కార్మికురాలు అతని చెరలో పడక తప్పలేదు. రోజు పనికి వచ్చిన ఆమెను ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. అంతటితో ఆగకుండా ఈ తతంగమంతా తన ఫోన్‌లో రికార్డు చేసి.. అవి మళ్లీ మళ్లీ చూస్తూ నేత్రానందం పొందాడు. ఈ క్రమంలో కిషన్ లైంగిక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తోటి కార్మికుల ఫోన్‌లో కూడా వీడియోలు ప్రత్యక్షమయ్యాయి. అవన్నీ చూసిన కార్మికులు ఏంటని ప్రశ్నించారు. దీంతో ఎవరికీ చెప్పొద్దంటూ ఒక్కొక్క కార్మికుడికి 10వేల చొప్పున దాదాపు 14 మందికి డబ్బులు ఇచ్చి కామాంధుడు కిషన్ వారి నోరు మూయించాడు. కూకట్‌పల్లి మహిళ ఐఏఎస్ అధికారిణి జోనల్ కమిషనర్ ఉన్న చోట ఈ దారుణం వెలుగు చూసింది. ఆమె పరిధిలో పని చేస్తున్న ఓ మహిళా పారిశుధ్య కార్మికురాలిపై ఇంత దారుణం జరుగుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంవిడ్డురంగా ఉందని మహళా కార్మికులు అంటున్నారు.

## శ్రీ గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**వైభవంగా స్వామివారికి రథోత్సవం**



**తిరుపతి,మే23:** శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం ఉదయం ఆలయ అధికారులు అంగరంగ వైభవంగా స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం కర్ణాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా తిరిగి ఆలయ రథమండపం వరకు సాగింది. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు గోవిందనామస్మరణతో రథాన్ని లాగారు. అలాగే 10గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈ నెల 15వ తేదీ సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. కాగా విశాఖ శారదపీఠం పీఠాధిపతి స్వరూపానంద స్వామి.. తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంవత్సరం చాలా అద్భుతాలు జరుతాయన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని స్వామి వారిని ప్రార్ధించానని స్వరూపానంద స్వామి తెలిపారు.

## నైట్ విజన్‌తో ఎ-130ఏ విమానం విజయవంతంగా ల్యాండ్

**న్యూఢిల్లీ,మే23:** ఈస్టర్న్ సెక్టార్‌లోని అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్‌లో నైట్ విజన్ గాగుల్స్‌ని ఉపయోగించి ఎ-130ఏ విమానాన్ని విజయ వంతంగా ల్యాండ్ చేసి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మరో మైలురాయిని సాధించింది. ఈ విజయాన్ని ఐఏఎఫ్ ఎక్స్‌లో ప్రకటించింది. ఇందుకు సంబంధించి రెండు వీడియోలను షేర్ చేసింది. వ్యూహాత్మక ఎయిర్‌లిఫ్ట్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇండక్షన్‌తో భారత వైమానిక దళ సామర్థ్యాలు గణనీయమైన వృద్ధిని సాధించాయి. ఈ విమానాలు కోవిడ్-19 మహమ్మారి సమయంలో వ్యాక్సిన్‌ల సరఫరాలో, ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి రప్పించడంలో కీలకంగా వ్యవహరించాయి. ఎ-130ఏ అనేది రెండు పైలట్ ఫ్లైట్ స్టేషన్, షార్ట్ టేక్ ఆఫ్, ల్యాండింగ్ సామర్థ్యాలను కలిగి ఉన్న అత్యాధునిక విమానం. ఇది నైట్ విజన్ గాగుల్స్ ఇన్‌ఫ్రారెడ్ థర్మల్ ఇమేజరీని ఉపయోగించి అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకుని, పగలు రాత్రి కార్యకలాపాలకు వీలు కల్పిస్తూ పూర్తిగా సమీకృత డిజిటల్ ఏవియానిక్స్‌తో అమర్చి ఉంటుంది. వీటితోపాటు విమానంలో కలర్ మల్టీఫంక్షనల్ లిక్విడ్ క్రిస్టల్ డిస్‌ప్లేలు, హెడ్-అప్ డిస్‌ప్లేలు అధునాతన నావిగేషన్ సిస్టమ్‌లు, డ్యూయల్ ఇనర్షియల్ నావిగేషన్, ఉఖాలు ఉన్నాయి.

## ఉత్తమ్‌పై ఆరోపణలు సత్యదూరం

**వైట్‌పేపర్ లాంటి వ్యక్తిపై ఇంక్ చల్లడం సరికాదు**
**బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డిపై జగ్గారెడ్డి విమర్శలు**

**హైదరాబాద్,మే23:** తెలంగాణ మంత్రులు అంతా కలసి కట్టుగా ఉన్నారని, నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తమ కెప్టెన్ సీఎం రేవంత్ రెడ్డి, రేవంత్ నేతృత్వంలో టీమ్ ప్రజల కోసం పనిచేస్తోందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఐదేళ్లు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, అందులో సందేహాలకు తావులేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని తేల్చి చెప్పారు. కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డిపై జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు. మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డిపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బాండ్ పేపర్లు రాసిచ్చి..ఇంత దగానా

**- వడ్లకు బోనస్ అడిగితే మొరుగుతున్నారంటారా - జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిశీలన**
**- రైతులు హైదరాబాద్‌కు వచ్చి ధర్నా చేస్తారని హెచ్చరిక - కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు**

**జగిత్యాల,మే23:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సిద్దిపేట భారాస ఎమ్మెల్యే మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ధాన్యం విక్రయం కోసం నెలరోజులుగా పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో పర్యటించిన ఆయన.. పూడురులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వం 67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ప్రస్తుతం 37 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. రైతులంతా హైదరాబాద్‌కు వచ్చి ఉద్యమం చేస్తామంటున్నారని పేర్కొన్నారు. వడ్లకు బోనస్ ఏమైందని అడిగితే.. వ్యవసాయ మంత్రి కొందరు మొరుగుతున్నారంటూ రైతులను కుక్కలతో పోలుస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు బాండ్ పేపర్‌పై రాసిచ్చి.. వడ్లకు బోనస్ ఇస్తామని ఇవాళ సన్నాలకు మాత్రమే ఇస్తామని ఇవాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని అన్నారు. ఆరోజు మీరు రాసిచ్చిన బాండ్ పేపర్‌పై సంతకాలు పెట్టారు కదా? మీరు సంతకాలు పెట్టి.. నమ్మబలికి బాండ్ పేపర్లు ఇచ్చి.. చేతుల్లో పట్టుకొని ఇవాళ వడ్లకు బోనస్ ఏమందంటే చేతులెత్తేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇవాళ జగిత్యాల జిల్లాలో రైతులతో, వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడితే జిల్లా పరిధిలో 2.97లక్షల ఎకరాల్లో యాసంగిలో వడ్ల పండితే.. 2.80లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్లే ఉన్నయ్. మిగితా 17వేల ఎకరాల్లో సన్నాలు సాగు చేశారు. అవి కూడా ఇంటిమందం సన్నాలు తిండిగింజల కోసం సాగు చేశారు. దానికి మీరు బోనస్ ఇచ్చేది ఏందీ? లక్ష్మారెడ్డి అనే రైతుతో మాట్లాడితే మా జగిత్యాలలో జైశ్రీరామ్ అనే సన్నవడ్లకు బయట రూ.2800-రూ.3వేలు కొనుగోలు చేస్తున్నరు. గవర్నమెంట్ ఇచ్చేది ఏందీ? ప్రైవేటులోనే కొనుగోలు చేస్తున్నారు. అందువల్ల రూ.500 కోసం ప్రభుత్వానికి అమ్మనే అమ్మరు. ఇదంతా మోసం ఉన్నది అని రైతు లక్ష్మారెడ్డి చెబుతూ వాపోతున్నరు. వాస్తవానికి దొడ్డు రకమైతే 25-30 క్వింటాళ్లు పండుతయ్. సన్న రకాలైతే 10-15 క్వింటాళ్లు పండుతయ్. దాదాపు పది క్వింటాళ్ల వరకు దిగుబడి తక్కువ. రోగాలు, పెట్టుబడి, నెలరోజుల కాలం ఎక్కువ. మన ప్రాంతంలో రైతులు పండించేది రూపాయికి 90 పైసలు దొడ్డు రకమే ఎక్కువ.

మరి సన్నాలకు బోనస్ ఇస్తామంటే.. రైతులను మోసం చేయడం, దగా చేయడం.. రైతులను గుండెలపై తన్నడం తప్ప ఇంకోటి లేదు' అన్నారు. ఈ రైతులే చెబుతున్నరు ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ మమ్మల్ని మోసం చేస్తున్నది. అంటే ఇవాళ రైతులను అవమానపరుస్తున్నారని అంటూ నిలదీశారు.రైతులందరూ ముక్తకంఠంతో చెబుతున్నరు. మేమందరం హైదరాబాద్‌కు వస్తాం. పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని చెబుతున్నరు. దీనిపై స్పందించాలని అన్నారు. మొన్న లోక్‌సభ ఎన్నికల సమయంలో డబ్బాలో ఓటుపడేదాక ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు సన్నాలకే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రైతులను మోసం చేస్తున్నరు. మంత్రులు మేల్కొనాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే వనపర్తిలో భారాస నేత శ్రీధర్ హత్య ఘటనను హరీశ్‌రావు ఈ సందర్భంగా ఖండించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే దాడులు పెరిగాయని ఆరోపించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోనే ఇద్దరు భారాస నేతలు హత్యకు గురయ్యారని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతుకలను కాంగ్రెస్ ప్రభుత్వం భయపెట్టలేదని స్పష్టం చేశారు. భారాస శ్రేణులు ధైర్యం కోల్పోవద్దని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.



# మాచర్ల ఘటనలో అధికారుల సస్పెన్షన్

**- సకాలంలో సమాచారం ఇవ్వనందుకు ఇసి చర్యలు**
**- పిన్నెల్లి అరెస్ట్‌కు రంగంలోకి 8 పోలీస్ బృందాలు - త్వరలోనే అరెస్ట్ చేస్తామని వెల్లడించిన ముకేశ్ కుమార్ మీనా**
**- టిడిపి నేతల పరామర్శలు సరికాదని వెల్లడి - ఈనెల 25 నుంచి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తానన్న మీనా**



**అమరావతి,మే23:** మాచర్ల నియోజకవర్గం పరిధిలోని పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో సరైన సమాచారం ఇవ్వనందుకు విధుల్లో ఉన్న పీవో, ఏపీవోలను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చినట్టు సీఈవో ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసేందుకు ఎస్పీ, డీఎస్పీలతో 8 పోలీసు బృందాలు పని చేస్తున్నాయన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు విషయంలో ఈసీ సీరియస్‌గా ఉందని, త్వరలోనే అరెస్టు చేసి తీరుతామని స్పష్టం చేశారు. మాచర్ల నియోజకవర్గంలో గాయపడిన కార్యకర్తల్ని పరామర్శించేందుకు తెదేపా నేతలు వెళ్లటం ఇప్పుడు మంచిది కాదని, ఇప్పుడిప్పుడే పరిస్థితులు అదుపులోకి వస్తున్నాయన్నారు. పరామర్శలకు ఈ సమయంలో వెళ్లొద్దని రాజకీయ నేతలకు విజ్ఞప్తి చేశారు. బయటి నుంచి నేతలెవరూ పరామర్శకు వెళ్లకూడదు, ఎవరినీ ఆ గ్రామాలకు వెళ్లనీయొద్దని సూచనలు జారీ చేశాం. పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసిన దృశ్యాలు ఈసీ నుంచి బయటకు వెళ్లలేదు. దర్యాప్తు సమయంలో ఎక్కడో.. ఎవరి చేతి నుంచో బయటకు వెళ్లాయి. ఈనెల 25 నుంచి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించేందుకు రాష్ట్రంలో పర్యటిస్తానని ఎంకే మీనా తెలిపారు.జూన్ 4న ఓట్ల లెక్కింపునకు పటిష్ట మైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో ఎంకే మీనా ఆదేశాలు జారీ చేశారు. ఫలితాలను కచ్చితత్వంతో త్వరితగతిన ప్రకటించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ఏర్పాట్లపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఎన్ని టేబుళ్లు, ఎన్ని రౌండ్ల లెక్కింపు అనే విషయాలను తెలియజేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక మీడియా సెంటర్లు ఏర్పాటు చేయాలి. కౌంటింగ్ సంబంధిత వివరాలను అభ్యర్థులు, ఏజెంట్లకు ముందుగానే తెలియజేయాలి. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంల తరలింపు మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లేందుకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలి. బారికేడ్లు, సూచికలను కూడా ఏర్పాటు చేయాలి.

## గుడివాడ ఎమ్మెల్యే నానికి అస్వస్థత

**ప్రథమ చికిత్స అందించిన వైద్యులు**

**అమరావతి,మే23:** గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అస్వస్థతకు గురయ్యారు. గురువారం నాడు తన స్వగృహంలో నందివాడ మండల వైసీపీ నాయకులతో మాట్లాడుతూ సోఫాలోనే ఒక్కసారిగా కొడాలి కుప్పకూలిపోయారు. దీంతో అప్రమత్తమైన నేతలు, గన్‌మెన్లు సపర్యలు చేసి.. వైద్యులకు సమాచారం అందించారు. వెంటనే ఇంట్లో ఉన్న కార్యకర్తలు, నేతలను గన్‌మెన్లు బయటికి పంపించేశారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం కొడాలి నానికి.. వైద్యులు సెలైన్లు ఎక్కిస్తున్నారు. నాని.. అతిగా ఆలోచించడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని గన్‌మెన్లు, కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. ఈ ఘటన జరిగినప్పుడు కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేరు. విషయం తెలుసుకుని హైదరాబాద్ నుంచి హుటాహుటిన గుడివాడకు కొడాలి కుటుంబ సభ్యులు బయల్దేరారు. నానికి ఇలా అయ్యిందని తెలుసుకున్న అభిమానులు, వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున కొడాలి ఇంటికి చేరుకుంటున్నారు. అసలేం జరుగుతోందో తెలియక గుడివాడ వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. అతిగా ఆలోచించాల్సిన అవసరం ఆయనకేంటి..? ఎన్నికల ఫలితాలపై ఆలోచిస్తున్నారా..? లేకుంటే మరేమైనా జరిగిందా అని అభిమానులు ఆలోచనలో పడ్డారు. అయితే ఈ మధ్య నాని ఎక్కువగా అనారోగ్యానికి గురవుతున్నారు. హైదరాబాద్‌లో ఇదివరకు చికిత్సలు చేయించుకున్నా ఆరోగ్యం సెట్ కావట్లేదని కార్యకర్తలు కంగారుపడుతున్నారు. అయితే ఎందుకిలా జరిగిందో.. నాని లేదా కుటుంబ సభ్యులు స్పందిస్తే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది..

# జూన్ 5 తరవాత భారాసా దుకాణం బంద్

**• కార్యకర్తలే పార్టీ నేతలపై తిరగబడతారు • రాష్ట్ర సంపదను దోచుకుని చిప్పచేతికి ఇచ్చారు • కవితపై 8వేల పేజీల చార్జిషీట్‌కు సమాధానం చెప్పండి**
**• కెటిఆర్ నోరు అదుపులో పెటుకోకుంటే ఖబర్దార్ • మంత్రి కోమటిరెడ్డి ఘాటు విమర్శలు**

**హైదరాబాద్,మే23:** ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 5 తర్వాత భారాస దుకాణం మూతపడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం భారాస నేతలను ఆ పార్టీ కార్యకర్తలే వెంటపడి కొడతారన్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంపదనంతా దోచుకున్నది చాలక కేసీఆర్ కుటుంబం దిల్లీకి వెళ్లింది. అవినీతి చేయకుండానే భారాస ఎమ్మెల్సీ కవితపై 8 వేల పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పుల ఖజానా మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. ఇకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరోసారి తమ ముఖ్యమంత్రి రేవంత్‌ని తిడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. కేటీఆర్ బచ్చా అని.. తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. కానీ, రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా గెలిచి లీడర్ అయ్యారని పేర్కొన్నారు. రేవంత్ వయసులో పోలిస్తే కేటీఆర్ చిన్న పిల్లాడు అని వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి పొట్ట కొట్టి కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల రిజల్ట్ తరువాత బీఆర్ఎస్ భూస్థాపితం అవడం ఖాయం అని అన్నారు. మేడిగడ్డ మాదిరిగానే బీఆర్ఎస్ పార్టీ కూలిపోవడం ఖాయం అన్నారు. కేసీఆర్ కూతురు కవిత చేసిన పనికి రాష్ట్రం పరువు పోతోందని వ్యాఖ్యానించారు. 5వ తేదీ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలే కేటీఆర్, హరీష్ రావునితరిమి కొడుతారని అన్నారు. నందినగర్ నుండి కారులో న్యూట్రల్‌లో వెళ్లినా అసెంబ్లీకి చేరుకోవచ్చునని.. కట్టే పట్టుకొని అసెంబ్లీకి రాలేదు కానీ, బీజేపీ కోసం కెసిఆర్ బస్సులో తిరిగారని కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. అసలు తెలంగాణ కోసం కొట్లాడింది తామేనని



మంత్రి కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి రెండు మూడు స్థానాల్లో డిపాజిట్ వస్తుందని.. అన్ని స్థానాల్లో ఓడిపోతుందని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. 12 రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ లేకుండా పోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి లీడర్, క్యాడర్ లేకుండా పోతారని అన్నారు. 5వ తేది తర్వాత తెలంగాణ భవన్‌కి తాళం వేసుకోవాల్సి వస్తుందన్నారు. కవితకు బెయిల్ రావట్లేదని కేటీఆర్ పూర్తిగా ఫ్రస్టేషన్‌లోకి వెళ్లారని.. అందుకే ఇష్టారీతిన తమ ప్రభుత్వంపై కారుకూతలు కూస్తున్నారంటూ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ఇస్తున్నందుకు మా రేవంత్‌ని తిడుతున్నావా? 500 రూపాయలకు సిలిండర్, ఉచిత విద్యుత్ ఇవ్వడమే మేం చేస్తున్న పాపమా? హాస్టల్స్, పేదవారికి ఇచ్చే ఉచిత బియ్యం పూర్తిగా సన్నబియ్యం ఇద్దామనుకోవడం తప్పా? మేం ఇచ్చిన నోటిఫికేషన్ కాంగ్రెస్ క్లెయిమ్ చేసుకుంటుంది అంటున్నావ్. మరి మీరే ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మా ముందు చూపుతోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. కేసీఆర్ చేసిన పనికి మూడు డ్యాములు కొట్టుకొని పోయే ప్రమాదం ఉందని నిపుణులు చెప్తున్నారు. కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయలు వృధా చేశారు. వైన్ షాపుల పేరు మీద కేసీఆర్ నాన్ రిఫండబుల్ పైసలు గుంజిండు. ఏకకాలంలో రుణమాఫీ చేయబోతున్నాం. మల్లన్నపై కేసులు ఉన్నాయని అంటున్నావ్.. మీ చెల్లిపై 8000 పేజీల ఛార్జ్ షీట్ పై ఏమంటావ్ కేటీఆర్? మహేశ్వర్ రెడ్డి ఏం పైరవీ చేసుకొని పదవి తెచ్చుకున్నారు? ఆయన పేరు పలకాలంటే సిగ్గుగా ఉంది?' అని కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. తెలంగాణ బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఈ డిపార్ట్‌మెంట్‌కి వెళ్లినా మహేశ్వర్ రెడ్డి ఆర్టీఐ అప్లికేషన్లే ఉంటున్నాయని అన్నారు. బ్లాక్ మెయిల్ చేసి పైసలు సంపాదించాలని మహేశ్వర్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. ఆర్టీఐలు కోరుతున్న మహేశ్వర్ రెడ్డి.. నిర్మల్ నియోజకవర్గానికి ఏం కావాలని ఒక్కసారైనా అడిగారా? అని మంత్రి ప్రశ్నించారు. ఇకపోతే జిల్లాల్లో మున్సిపాలిటీల అనుమతులు లేకుండానే భారాస కార్యాలయాలు నిర్మించారు. ప్రభుత్వ ఆస్పత్రుల భవనాలు 14 అంతస్తులు మించరాదని నిబంధనలు చెబుతున్నాయి. ఎల్బీనగర్ ఆస్పత్రి స్థలానికి ఎన్‌వోసీ లేకుండా నిర్మాణం చేపట్టారు. అందెశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించాలని గత ప్రభుత్వాన్ని కోరాం. ఆడిటోరియానికి కాళోజీ పేరు పెట్టాలంటే పెట్టలేదు. నల్గొండ జిల్లాకు ఎస్ఎల్‌బీసీ సొరంగం మంజూరు చేయిస్తే.. భారాస ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శలు చేశారు. ఇచ్చిన హామీలను ప్రాధాన్య క్రమంలో నెరవేర్చుకుంటూ వెళ్తున్నామని, వేసవిలో వడగళ్ల వాన కారణంగా పంటనష్టం జరిగితే రైతులకు రూ.1500 కోట్ల పరిహారం చెల్లించినట్లు వెల్లడించారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com